
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5
గుంటూరు జిల్లా వార్తలు
శుక్రవారం 23 ఆగస్టు 2024



స్వర్ణ గ్రామాలే.. సంకల్పం

గ్రామ స్వరాజ్యం.. గాంధీ కల. స్వర్ణాంధ్రప్రదేశ్ చంద్రబాబు ధ్యేయం.. ఈ రెండింటినీ మిళితం చేస్తూ స్వర్ణ గ్రామాల సంకల్పంతో గ్రామసభలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. శుక్రవారం గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఎక్కడికక్కడ గ్రామసభలు జరగనున్నాయి. గుంటూరు జిల్లాలో 233, బాపట్ల జిల్లాలో 459, పల్నాడు జిల్లాలో 534 పంచాయతీల్లో గ్రామసభల నిర్వహణకు అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లో ఏమేమి అభివృద్ధి పనులు అవసరం, ప్రజలు ఏమి కోరుకుంటున్నారు.. అనే అంశాలపై ఈ గ్రామసభల్లో చర్చించి ప్రభుత్వానికి ప్రతిపాదించనున్నారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పంచాయతీలకు జవసత్వాలు అందించడంపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగానే ఇటీవల నిధులు విడుదల చేయగా.. గత ప్రభుత్వంలో ఊసేలేని గ్రామసభలకు కూడా కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుసందానం చేసి రైతులకు అండగా నిలవాలని నిర్ణయం తీసుకుని ఇందుకు సంబంధించి రైతుల ఆలోచనలతో ముందడుగు వేసేందుకు గ్రామ సభలనే వేదికగా ఎంచుకుంది.



- నేడు 1226 పంచాయతీల్లో గ్రామసభలు
- గ్రామసభల నిర్వహణకు భారీగా ఏర్పాట్లు
- పల్లెల అభివృద్ధిపై ప్రతిపాదనల రూపకల్పన
- వ్యవసాయానికి దన్నుగా ఉపాధి హామీపై చర్చ
- సభలకు నోడల్ ఆఫీసర్‌గా మండల స్థాయి అధికారి


గుర్రపుడెక్కతో నిండిన గుంటూరు ఛానల్

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్రప్రదేశ్‌కి.. ఉమ్మడి రాష్ట్రంలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. ఆ కార్యక్రమాన్ని ఆధారంగా చేసుకుని ఇప్పుడు స్వర్ణ గ్రామాలు చేపట్టాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. మునుపెన్నడూ జరగని విధంగా గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఈ క్రమంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని 1226 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఒక్క రోజే గ్రామసభల నిర్వహణకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఆయా పంచాయతీల్లో ఒకేసారి గ్రామ సభలు నిర్వహించడానికి అవసరమైనట్లుగా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒక్కో గ్రామసభకు మండల స్థాయి అధికారి నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు. ఇప్పటికే పంచాయతీ కార్యాలయాల్లో చేపడుతున్న గ్రామసభల ఉద్దేశాన్ని వివరిస్తూ గ్రామాల్లో పెద్దఎత్తున ప్రచారం చేశారు. పార్టీలకతీతంగా సర్పంచ్, వార్డు సభ్యులతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు ఈ సభల్లో భాగస్వామ్యం కానున్నారు. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోక గ్రామాలను వేధిస్తున్న ఎన్నో సమస్యలు గ్రామ సభల్లో చర్చకు రానున్నాయి. పంచాయతీ సర్పంచ్, సెక్రెటరి మొదలు ఎంపీడీవో, స్పెషలాఫీసర్లు, జిల్లా స్థాయి అధికారులు ఈ గ్రామసభలకు హాజరై ప్రజలతో మమేకమై చర్చిస్తారు. ఆ తర్వాత తీర్మానాలు చేసి ప్రతిపాదనలను జిల్లా నీటియాజమాన్య సంస్థ ద్వారా కలెక్టర్‌కు నివేదిస్తారు. కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించి అవసరమైన లేబర్, మెటీరియల్ కాంపోనెంట్ నిధులను ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటారు.

మొక్కుబడి తంతుగా కాకుండా..

గతంలో మొక్కుబడి తంతుగా నిర్వహించిన ఈ సభలను సంస్కరించి అత్యంత ప్రాధాన్యం గల అంశంగా మార్గదర్శకాలు మార్చి కూటమి ప్రభుత్వం తిరిగి తీసుకొచ్చింది. గ్రామసభలను మొక్కుబడితంతుగా కాకుండా పంచాయతీల పరిధిలోని సమస్యల పరిష్కార వేదికగా ఉండాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉంది. సీసీరోడ్లు మొదలుకుని గత ప్రభుత్వంలో నిధుల వినియోగంలో జరిగిన అవకతవకల వరకు అన్ని అంశాలపైనా గ్రామసభల దృష్టిలో పెట్టొచ్చు. సభ దృష్టికి వచ్చిన సమస్య పరిష్కారంపై కూడా నిర్దిష్ట కాలపరిమితి విధించి జవాబుదారీతనం కల్పించే విధంగా ప్రభుత్వం అడుగులేస్తోంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా గ్రామాల్లో చేపట్టే ప్రతిపని పురోగతి కూడా గ్రామసభల్లో చర్చకు రానుంది. కౌలు రైతులకు పెద్ద సంఖ్యలో జారీ చేసిన సీసీఆర్‌సీ కార్డులు, మినీ గోకులాలు, సూక్ష్మసేద్యం విషయంలో పురోగతి, ఉద్యాన పంటలకు ఇటీవలే విడుదల చేసిన రాయితీలు, రాయితీ యంత్రాల విషయంలో నూతన మార్గదర్శకాలు తదితర అంశాలన్నీ గ్రామసభల్లో చర్చకు రానున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉపాధి హామీ నిధులు కూడా దారి మళ్లిన నేపథ్యంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉండాలని నిర్ణయం తీసుకొన్నది. దీంతో శుక్రవారం జరిగే గ్రామసభల్లో అందరూ పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేయాలని డ్వామా పీడీ

హద్దులు అంటూ లేకుండా పనులు

వ్యవసాయ అనుబంధ పనులను కూడా ఉపాధి హామీ కింద చేపట్టవచ్చు. కొత్త ఫీడర్ కాల్వలు, పంటకాల్వల తవ్వకం, పొలం గట్లపై మొక్కల పెంపకం, రైతుల భూముల్లో సేద్యపు నీటి గుంటల నిర్మాణం, వ్యక్తిగత భూముల్లో భూమి అభివృద్ధి పనులు, సరిహద్దు కందకాలు, వ్యవసాయ బావుల నిర్మాణం, పండ్ల తోటల రింగు ట్రెంచ్‌ల నిర్మాణం, భూసార సంరక్షణ కందకాలు తవ్వడం, గడ్డి పెంపకం, పశువుల షెడ్లు, కోళ్ల ఫారాల నిర్మాణం, పట్టు పురుగుల షెడ్లు టైపు-1, 2, చెరువుల పునరుద్ధరణ, చెరువుల సరిహద్దు చుట్టూత కందకాలు తవ్వి మొక్కల పెంపకం, ప్రభుత్వ సంస్థల్లో సరిహద్దు కందకాల తవ్వకం, వ్యక్తిగత భూముల్లో పండ్ల తోటలు, పూలతోటలు, మల్బరీ తోటల పెంపకం, నర్సరీల ఏర్పాటు, గొర్రెల షెడ్లు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటడం, మడ అడవుల పెంపకం, కాలువల్లో పూడిక తొలగింపు వంటి అనేక వ్యవసాయ పనులకు అనుమతి ఉన్నది. ఊట చెరువులు, పశువుల చెరువులు, వరద కట్టల నిర్మాణం, చెక్ డ్యాంల నిర్మాణం/మరమ్మతులు, బోర్‌వెల్ రీచార్జ్, కొండ దిగువ ప్రాంతాల్లో నీటి నిల్వ కందకాలు, రైల్వేలేన్ సరిహద్దు వెంట కందకాల తవ్వకం, చెరువులు/కుంటల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ గుంటల నిర్మాణం చేపట్టవచ్చు. అలానే మౌలిక సదుపాయాల కింద గ్రామ పంచాయతీల భవనాలు, వ్యవసాయ ఉత్పత్తి నిల్వ కేంద్రాలు, భారత్ నిర్మాణ్ సేవా కేంద్రాలు, స్వయం సహాయ కేంద్రాలు, పాఠశాల ప్రహరీ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణం చేపట్టవచ్చు. సిమెంట్ రోడ్లు, డబ్ల్యూబీఎం, బీటీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, ఆటస్థలాలు, సామూహిక ఇంకుడు గుంతలు, శ్మశాన వాటికలు, ఆహార నిల్వ కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలను కూడా నిర్మించుకోవచ్చు. కాగా వ్యక్తిగత లబ్ధిచేకూర్చే పనులు కూడా ఉపాధిహామీ కింద చేసుకోవచ్చు. పొలంగట్లపై మొక్కల పెంపకం, రైతుల భూముల్లో సేద్యపు నీటి గుంటల నిర్మాణం, వ్యక్తిగత మరుగుదొడ్లు, గృహ నిర్మాణానికి 90 రోజుల పనిదినాల కల్పన వంటివి చేసుకునే వీలుంది. గ్రామసభల్లో ప్రజలు, రైతులు ఆయా పనులపై అభిప్రాయలను అందజేసి తద్వారా ఆయా పనులు చేసుకునే అవకాశం ఉంది.

ఉపాధితో.. అన్నదాతలకు అండ

గ్రామాలలో వ్యవసాయ పనులకు ఉపాధి హామీ పథకాన్ని అనుసందానం చేస్తే రైతులకు ఉపయుక్తంగా ఉంటుందనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. గత ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించకపోగా పంచాయతీలను నిర్వీర్యం చేయడంతో పాటు ఉపాధి హామీ పథకం నిధులు కూడా పక్కదారి పట్టించే చర్యలకు పాల్పడింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పంచాయతీలకు జవసత్వాలు అందించడంపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగానే ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుసందానం చేసి రైతులకు అండగా నిలవాలని నిర్ణయించింది. పంచాయతీల్లో శుక్రవారం జరిగే గ్రామ సభలనే ఇందుకు వేదికగా ఎంచుకుంది. ఉపాధి హామీ పనుల విషయంలో ఇంతవరకు జరిగిన చెల్లింపులు, మెటీరియల్ అంశాలపై సభల్లో చర్చించి ఓ నిర్ణయం తీసుకోవడానికి ప్రణాళిక రూపొందించారు. ఉపాధి హామీ వేతనదారులతో పాటు గ్రామాల్లో ఉన్న అన్నదాతలు పెద్ద ఎత్తున గ్రామ సభల్లో పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. ఉపాధి హామీ పనుల ద్వారా పొలాల్లో చేపట్టాల్సిన పనుల గురించి సభ ముందుకు తీసుకెళతారు. వీటిపై సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి అనుమతులు ఇస్తారు. ఇంతకు ముందు ఉపాధి నిధులతో చేపట్టే చెరువులు, కాల్వల పనులు, మొక్కల పెంపకం వంటి వాటిని యథావిధిగా కొనసాగిస్తూనే రైతులకు అండగా ఉండడానికి ఉపాధిహామీ పనులను వ్యవసాయానికి అనుసందానం చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టనున్నారు. ఎంత ఎక్కువగా పనిదినాలు కల్పించుకుంటే అంత ఎక్కువగా మెటీరియల్ కాంపొనెంట్ కింద నిధులు మంజూరు అవుతాయి.

సాగునీటి కాల్వలకు ప్రాధాన్యం దక్కేనా?

గుంటూరు, పల్నాడు జిల్లాలతో పాటు బాపట్ల జిల్లాలో వ్యవసాయం ఎక్కువగా కాల్వల్లో పారే నీటి ద్వారానే జరుగుతుంది. అయితే ఈ సాగునీటి కాల్వలు ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. గుంటూరు చానల్ కనీస మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో కాల్వల ద్వారా సాగునీరు పొలాలకు సక్రమంగా అందక రైతులు అల్లాడుతున్నారు. నాగార్జున సాగర్ కుడి కాల్వ నుంచి మూడు జిల్లాల్లో ప్రధాన కాల్వలన్నీ కూడా అధ్వానంగా ఉన్నాయి. తూటికాడ, పూడిక, పిచ్చిచెట్లు, నాచులతో కాల్వలో నీరు సరఫరా అయ్యే పరిస్థితి లేదు. కాల్వల బాగుకు నిధుల కొరత వెంటాడుతోంది. ఈ క్రమంలో ఉపాధితో గ్రామాభివృద్ధికి శ్రీకారం చుట్టేందుకు సంకల్పించిన కూటమి ప్రభుత్వం సాగునీటి కాల్వల్లో పూడిక తీతకు ప్రాధాన్యం ఇవ్వాలని రైతులు సూచిస్తున్నారు. ఈ పనులు నిర్వహిస్తే సాగు నీటి సమస్యలను పరిష్కరించడం ద్వారా రైతులకు మేలు జరుగుతుంది. దారుణంగా ఉన్న సాగు నీటి కాల్వల అంశాన్ని రైతులు గ్రామసభల్లో ప్రస్తావించి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు అందించాలి.

టీడీపీ కార్యాలయంపై దాడి కేసు దర్యాప్తు

- 106 మందిలో ఇప్పటికే 21 మంది అరెస్టు.. 85 మందికి తాజాగా నోటీసులు
- ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, దేవినేని అవినాష్‌లతోపాటు ఓ న్యూస్ చానల్ రిపోర్టర్‌కూ..


టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి జరిగినప్పటి దృశ్యాలు (ఫైల్)



మంగళగిరి, గుంటూరు, ఆగస్టు 22: మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ మూకలు దాడి చేసిన కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా దాడిలో పాల్గొన్న నిందితుల్లో కొంత మందిని ఇప్పటికే అరెస్టు చేయగా, మిగతా వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. 2021 అక్టోబరు 19న జరిగిన ఘటనపై మంగళగిరి రూరల్ పోలీసులు క్రైం నెంబర్ 650/2021గా కేసు నమోదు చేశారు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో పోలీసులు తూతూమంత్రంగా కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. అయితే రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడంతో ఈ కేసుపై దృష్టి సారించారు. ఐపీసీ 307 సెక్షన్‌తో పాటు మరికొన్ని సెక్షన్లను జోడించారు. ఐపీసీ 147,148, 452, 427, 323, 324, 506, 326, 307, 450, 380, రెడ్‌విత్ 109, 120బి, 149 తదితర సెక్షన్లతో కేసు నమోదైంది. ఈ క్రమంలో ఇప్పటివరకు మొత్తం 106 మందికి టీడీపీ కార్యాలయంపై దాడిలో ప్రమేయం ఉన్నట్లు పోలీసుల విచారణలో గుర్తించారు. 21 మందిని అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. మిగతా 85 మందికి మంగళగిరి రూరల్ పోలీసులు ఈ నెల 19 నుంచి నోటీసులు జారీ చేశారు. వీరిలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డితో పాటు, విజయవాడకు చెందిన వైసీపీ నేత దేవినేని అవినాష్, అరవ సత్యం వంటి ముఖ్య నేతలతోపాటు ఓ న్యూస్ చానల్ రిపోర్టర్ కూడా ఉన్నాడు. అందుబాటులో లేని వారి ఇళ్లకు నోటీసులు అతికిస్తున్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడికి పాల్పడిన కొందరు వైసీపీ నేతలు ఎన్నికల ముందు, తర్వాత టీడీపీలో చేరారు. అలాంటి వారిని ఉపేక్షించవద్దని టీడీపీ కార్యకర్తలు అనేక మార్లు అధినేత చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు పలుమార్లు ఫిర్యాదులు కూడా చేశారు. దీనిపై సీఎం చంద్రబాబు పలు సందర్భాల్లో స్పందిస్తూ చట్టాన్ని ధిక్కరించిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని, చట్ట ప్రకారం శిక్షించాలని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కేసు నుంచి తప్పించుకోవడానికి టీడీపీలో చేరిన వైసీపీ నేతలపై కూడా చర్యలు ఉంటాయనేది స్పష్టమవుతోంది.

వైసీపీ కార్యాలయ ప్రతినిధులకు మళ్లీ నోటీసు..

టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి ఘటనకు సంబంధించి ఆ రోజు వైసీపీ కార్యాలయంలోని సీసీ కెమెరాల ఫుటేజ్ ఇవ్వాలని కోరుతూ వైసీపీ కార్యాలయ సిబ్బందికి మంగళగిరి రూరల్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఆయా నోటీసులను వైసీపీ కార్యాలయ గోడకు అంటించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడికి వైసీపీ కార్యాలయం నుంచే పథకం రూపొందించడంతో పాటు కార్యాలయంపై దాడికి వచ్చే ముందు సూత్రధారులతో పాత్రధారులు వైసీపీ కార్యాలయంలో సమావేశమైనట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో దాడి జరిగిన రోజు వైసీపీ కార్యాలయం వద్ద ఉన్న సీసీ కెమెరా ఫుటేజ్‌లను పరిశీలిస్తే కుట్ర కోణం ఛేదించవచ్చని, ఈ కేసులో కీలక ఆధారాలు లభించే అవకాశం ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. దీనిలో భాగంగానే ఘటన జరిగిన రోజుకు సంబంధించి 24 గంటల సీసీ ఫుటేజ్ ఇవ్వాలంటూ వైసీపీ కార్యాలయ సిబ్బందికి ఈ నెల 13న సీఆర్‌పీసీ 160 ప్రకారం నోటీసు జారీ చేశారు. ఈ నెల 16న మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో విచారణాధికారి ఎదుట సీసీ ఫుటేజ్‌తో హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు. అయితే 16న వైసీపీ కార్యాలయ ప్రతినిధులు ఎవరూ హాజరు కాకపోవడంతో మరో సారి నోటీసు జారీ చేసేందుకు సిద్ధమయ్యారు.


మంగళగిరిలోని వైసీపీ కార్యాలయ గేటుకు పోలీసులు అంటించిన నోటీస్

ఉచిత ఇసుక.. సులభతరం

- వచ్చే నెల 11 నుంచి ఆన్‌లైన్ విధానం
- టైమ్ స్లాట్ ప్రకారం వేగంగా లోడింగ్
- తాళ్లాయపాలెం, లింగాయపాలెంలో 3 లక్షల మెట్రిక్ టన్నుల లభ్యత
- స్టాక్ పాయింట్‌లలో కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్ తనిఖీ

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక విధానాన్ని మరింత సులభతరం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రక్రియలో భాగంగా వచ్చే నెల 11వ తేదీ నుంచి ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేస్తు న్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఉచిత ఇసుక విధా నంపై వాహన యజమానులతో గురువారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో ఎస్పీ సతీష్‌కుమార్‌తో కలసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక స్టాక్ యార్డుల వద్ద బుకింగ్ చేయడం జరగదన్నారు. అనుమతి ఉన్న వాహనాలకే స్టాక్ యార్డుల్లో ప్రవేశం కల్పించేందుకు సంబంధించి తుళ్ళూరు, తాడేపల్లి తహసీల్దారు కార్యాలయాలు, గుంటూరు ఆర్డీవో కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు అనుమతులు జారీ చేస్తామన్నారు. ఇక్కడే ఏ తేదీన, ఏ సమయంలో స్టాక్‌యార్డుకు వాహనం వెళ్లాలనేది నిర్ణయించి టోకెన్ జారీ చేస్తామన్నారు. జిల్లా ఇసుక కమిటీలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వాహనాలకు మాత్రమే ఇసుక రవాణాకు అనుమతులు జారీ చేస్తామన్నారు. రిజిస్ట్రేషన్ కోసం వాహన యజమానులు, డ్రైవరు వివరాలు, డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఫిట్నెస్ సర్టిఫికెట్‌తో పాటు జీపీఎస్ తప్పనిసరిగా ఉండాలన్నారు. రిజిస్ట్రేషన్ వాహనాలకు పర్మిట్ ఇస్తామని, అందువల్ల టైమ్ స్లాట్ ప్రకారం సులభంగా లోడింగ్ జరుగుతుందన్నారు. దీంతో యార్డుల వద్ద వాహనాల క్యూలు ఉండవన్నారు. ఇసుక రవాణ చేసే వాహనాలను టార్పాలిన్‌తో తప్పనిసరిగా కప్పి ఉంచాలన్నారు. ఇసుకను బుక్ చేసేటప్పుడు వినియోగదారుడి వివరాలు, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్, చేరవేసే ప్రదేశం, వాహనదారుల నుంచి ఒక అంగీకారపత్రం తప్పని సరిగా అందించాలన్నారు.


లింగాయపాలెం ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్

అనధికార విక్రయాలపై చర్యలు

అనధికారికంగా ఎవరైనా ఇసుకని రీసేల్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజలు టోల్ ఫ్రీ 18005994599, 08632234301 నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ప్రస్తుతం గుండిమెడలో ఇసుక అయిపోయిందని, కొల్లిపరలోనూ చివరి దశకు చేరుకొందన్నారు. తాళ్లాయపాలెం, లింగాయపాలెంలో 3 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ఇసుక లభ్యత ఉందని చెప్పారు. త్వరలో మరికొన్ని రీచ్‌లలో ఇసుక తవ్వి స్టాక్‌యార్డులకు తరలిస్తామన్నారు. రోజుకు 600 వాహనాల ఇసుకని ప్రజలు తీసుకెళ్లేలా ప్రణాళిక రూపొందించామన్నారు. సమావేశంలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి ఉంటేనే ప్రవేశం..

తుళ్లూరు: స్టాక్ యార్డుల్లో అనుమతి ఉన్న వాహనాలకే ప్రవేశమని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. మండల పరిధిలోని లింగాయపాలెం, తాళ్లాయపాలెంలోని ఇసుక స్టాక్ పాయింట్లను ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ భార్గవ్‌తేజతో కలిసి కలెక్టర్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్టాక్ పాయింట్ల వద్ద వాహనాల రద్దీని నియంత్రించేందుకు, వాహనాల వెయిటింగ్ చార్జీల సమస్య లేకుండా నివారించేందుకు యార్డుల వద్ద బుకింగ్ ఉండదన్నారు. తుళ్లూరు, తాడేపల్లి, గుంటూరులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బుకింగ్ కేంద్రాల నుంచి ఇసుక రవాణా అనుమతి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో కె.శ్రీదేవీ, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, మైనింగ్ డీడీ చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ ఆర్డీఏవో గంగరాజు తదితరులు ఉన్నారు.

14 మంది సీఐలకు పోస్టింగ్స్

- ఉత్తర్వులు జారీ చేసిన ఐజీ త్రిపాఠి

గుంటూరు, ఆగస్టు 22: గుంటూరు రేంజ్ పరిధిలో కొద్దిరోజులుగా జరుగుతున్న సీఐల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది దీనిలో భాగంగా గురువారం రేంజ్ పరిధిలో 14 మంది సీఐలకు పోస్టింగ్స్ ఇస్తూ ఐజీ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన సీఐల వివరాలు ఇలా ఉన్నాయి.

పేరు	ప్రస్తుతం	బదిలీ
గన్నవరపు శ్రీనివాసరావు	ఒంగోలు పీటీసీ	ప్రత్తిపాడు
షేక్ నాగూర్‌మీరా షరీఫ్	ఇంటెలిజెన్స్	మేడికొండూరు
ఈ నారాయణ	ఇంటిలిజన్స్	గుంటూరు దిశ 1
బీ బ్రహ్మయ్య	రేంజి వీఆర్	సత్తెనపల్లి టౌన్
ఎం హైమారావు	రేంజి వీఆర్	నరసరావుపేట 2 టౌన్
బలగాని ప్రభాకరరావు	తుళ్లూరు ట్రాఫిక్	వినుకొండ రూరల్
ఆర్ సురేష్‌బాబు	నెల్లూరు ఎస్సీఎస్టీసెల్	రేపల్లె రూరల్
పీవీ ఆంజనేయులు	రేంజ్ వీఆర్	వేమూరు రూరల్
బీ నాగభూషణం	రేంజి వీఆర్	చీరాల 2 టౌన్
షేక్ ఖాజావలి	ఒంగోలు మహిళా పీఎస్	కనిగిరి
సీహెచ్ ప్రభాకర్‌రావు	రేంజి వీఆర్	యర్రగొండపాలెం
ఆర్ఎస్ కిశోర్‌కుమార్	మెరైన్	నెల్లూరు 5వ పట్టణం
ఓ పాపారావు	రేంజి వీఆర్	కావలి రూరల్
జే శ్రీనివాస్	రేంజ్ వీఆర్	గూడూరు 2 టౌన్

కుంభవృష్టి.. స్తంభించిన జనజీవనం


గుంటూరులో కురిసిన వర్షానికి జూట్‌మిల్ ఎదుట జలమయమైన ప్రధాన రహదారి

నగరంలో గురువారం సాయంత్రం ఆకస్మికంగా కురిసిన భారీ వర్షానికి నగరవాసులు నరకం చవిచూశారు. గంటన్నర సేపు ఏకదాటిగా కురిసిన కుండపోత వర్షానికి నగరం అతలాకుతలమైంది. లోతట్టు ప్రాంతాలే కాక ప్రధాన రోడ్లు సైతం మోకాలులోతు నీటితో చెరువులు, కాలువలను తలపించాయి. జనజీవనం పూర్తిగా స్తంభించింది. అనేక రోడ్లు, కూడళ్లలో మోకాలు లోతు నీరు నిలిచి ఉండడంతో వాహనాలు ఎక్కడికక్కడ కిక్కిరిసిపోయాయి. కార్లు సైతం కదలలేని స్థితిలో నిలిచిపోయాయి.

- గుంటూరు



వర్సిటీలో ర్యాలీ నిర్వహిస్తున్న లీగల్ డిపార్ట్‌మెంట్ విద్యార్థులు, ఆచార్యులు

మహిళల రక్షణకు చర్యలు చేపట్టాలి

- కోల్‌కత్తా ఘటనను ఖండిస్తూ ఏఎన్‌యూలో విద్యార్థినుల నిరసన
- వర్సిటీలో మహిళా గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని వినతి

పెదకాకాని,ఆగస్టు 22: విద్యార్థినులు, మహిళల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని విద్యార్థినులు డిమాండ్ చేశారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కత్తా నగరంలో ఆర్జీకర్ ప్రభుత్వాస్పత్రిలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన దారుణ ఘటనను ఖండిస్తూ గురువారం ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో పీజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్కూల్ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఆయావిభాగాల ఫ్యాకల్టీ మెంబర్స్ విద్యార్థినీ, విద్యార్థులు నిరసన ర్యాలీ చేపట్టారు. విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీ వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ అన్ని విభాగాలు మీదుగా వర్సిటీ ప్రధాన గేటులోని ఆచార్య నాగార్జున విగ్రహంవరకు కొనసాగింది. అనంతరం వర్సిటీ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కే.గంగాధరరావును కలిసి పలు డిమాండ్లపై వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎల్‌ఎల్‌ఎం క్రైమ్ బ్రాంచ్ విద్యార్థిని తన్మయ్ మాట్లాడుతూ వర్సిటీలో విద్యార్థినుల సమస్యల పరిష్కారం కోసం సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ (ఎస్‌పీఓసీ), తో పాటుగా ఉమన్ గ్రీవెన్స్‌సెల్‌ని ఏర్పాటు చేయాలని ఇన్‌చార్జి వీసీని కోరారు. దీనిపై ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయంపై విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ ఎల్. జయశ్రీని పరిశీలించమని సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎల్. జయశ్రీ, డాక్టర్ ఎన్.సతీష్, డాక్టర్ పీ.వెంకట్‌రమణ, డాక్టర్ జీ.వైఎన్. కిషోర్‌కుమార్, ఎస్.చంద్రశేఖర్, డాక్టర్ ఎన్.రాధిక, డాక్టర్ సీహెచ్. సురేష్, డాక్టర్ శివరాం, చిన్నారావు, డాక్టర్ సతీష్, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకాల్వకు 8004 క్యూసెక్కులు

దుగ్గిరాల,ఆగస్టు22: విజయవాడ ప్రకాశంబ్యారేజి నుంచి పశ్చిమడెల్టా కాల్వకు గురువారం 8004 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దిగువకు 14,600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కాగా దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 340 క్యూసెక్కులు, రేపల్లెకాల్వకు 1861 , తూర్పుకాల్వకు 761, పశ్చిమకాల్వకు 250, నిజాంపట్నంకాల్వకు 490, కొమ్మమూరు కాల్వకు 3120 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

వైద్యుల రక్షణకు ఉన్నత స్థాయి కమిటీ


జూడాలతో చర్చలు జరుపుతున్న సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్

- రక్షణ వ్యవస్థలను పటిష్ఠం చేసేందుకు చర్యలు
- జూడాలకు జీజీహెచ్ సూపరింటెండెంట్ హామీ
- వివిధ అంశాలపై వారితో చర్చలు

గుంటూరు (మెడికల్) ఆగస్టు 22: ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో జూనియర్ డాక్టర్ల రక్షణకు ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్‌కుమార్ తెలిపారు. కోల్‌కతాలో మెడికల్ పీజీ విద్యార్థిని హత్యాచార ఘటన నేపథ్యంలో నింధితులను కఠినంగా శిక్షించాలని, విధి నిర్వహణలో వైద్యులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12 నుంచి జీజీహెచ్‌కు చెందిన జూనియర్ డాక్టర్లు విధులు బహిష్కరించి, నిరవధికంగా నిరసన చేపట్టిన విషయంతెలిసిందే. గురువారం సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ నిరసన శిబిరాన్ని సందర్శించి జూనియర్ డాక్టర్లతో చర్చలు జరిపారు. విధుల్లో ఉండే వైద్యులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆస్పత్రిలో రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నట్లు వివరించారు. అదనంగా మరో 100 మంది ప్రైవేటు సెక్యూరిటీని నియమించాలని డీఎంఈకి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. రోగుల సహాయకులు ఎక్కువ మంది ఆస్పత్రిలోకి రాకుండా కట్టడిచర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆస్పత్రిలో పోలీసు పెట్రోలింగ్ వ్యవస్థను బలోపేతం చేస్తామన్నారు. జీజీహెచ్ పోలీస్ అవుట్ పోస్టులో పోలీసులు సంఖ్యను పెంచాలని ఎస్పీని కోరినట్లు డాక్టర్ కిరణ్‌కుమార్ వెల్లడించారు. అవుట్ పోస్టు పోలీసులు యూనిఫాంలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

జీజీహెచ్ చుట్టూ హోటళ్లు, ఆటోస్టాండ్ తొలగిస్తాం...

ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్లు తమ సమస్యను అధికారుల దృష్టికి తెచ్చారు. రక్షణ వ్యవస్థను పటిష్ఠం చేయాలన్నారు. వైద్యులపై దాడులు జరిగితే నిందితులపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో ఉండే వైద్యులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. వీటిపై డాక్టర్ కిరణ్‌కుమార్ సానుకూలంగా స్పందించారు. అదేవిధంగా ప్రభుత్వాస్పత్రి ప్రహరీ చుట్టు ఉన్న వ్యాపారాలు, ఆటోస్టాండ్‌ను తక్షణం తొలగించాలని జీఎంసీ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపుతున్నట్లు ప్రకటించారు. అంతకు ముందు జూడాలు తమ నిరసన కొనసాగించారు. పలు వార్డులకు వెళ్లి.. తాము ఎందుకు ఆందోళన కార్యక్రమాలు చేస్తోందీ రోగులకు, వారి సహాయకులకు వివరించి తమకు మద్దతు ఇవ్వాలని కోరారు.


వార్డులో ప్రచారం చేస్తున్న జూనియర్ డాక్టర్లు


గుంటూరు ఛానల్‌ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

గుంటూరు ఛానల్‌కి రూ.626 కోట్లు

- ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు వెల్లడి
- రైతులతో కలసి గారపాడు వద్ద కాలువ పరిశీలన

వట్టిచెరుకూరు, ఆగస్టు 22: గుంటూరు ఛానల్ పొడిగింపు, ఆధునికీకరణ పనులకు గాను రాష్ట్ర ప్రభుత్వం రూ. 626 కోట్లు మంజూరు చేస్తుందని, ఈ విషయాన్ని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు. గురువారం ఆయన వట్టిచెరుకూర మండలం గారపాడులో స్థానిక రైతులతో కలసి గుంటూరు ఛానల్‌ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ఛానల్ మరమ్మతులకు నోచుకోక పోవడంతో నీరు రావడం లేదని, దీంతో పైరులు ఎండిపోతున్నాయని, తక్షణమే కాల్వలో పూడికను తొలగించాలని, కాలువను వెడల్పు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఇచ్చిన హామీ మేరకు గుంటూరు చానల్ పొడిగింపు, మరమ్మతుల నిర్వహణకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇచ్చిన హామీని నెరవే ర్చేందుకు ప్రభుత్వం త్వరలోనే చర్యలు తీసుకుంటుందని అన్నారు.

ఐరోపా పర్వతంపై తాడేపల్లి మహిళ

- 18,510 అడుగుల ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించి సంచలనం


ఎల్బ్రస్ పర్వతంపై బండారు అన్నపూర్ణ

తాడేపల్లి టౌన్, ఆగస్టు 22: బాలికలు కొండలు ఎక్కడంపై సమాజంలో నెల కొన్న వివక్ష కారణంగా బాల్యంలో మిన్న కుండిపోయిన ఓ మహిళ తన పట్టుదలతో నేరుగా ఐరోపా ఖండంలోనే అతి పెద్దపర్వతాన్ని అధిరోహించి సంచలనం సృష్టించింది. గుంటూరుజిల్లా తాడేపల్లికి చెందిన బండారు అన్న పూర్ణ బాల్యంలో తాడేపల్లి కొండలపై ఎక్కుతుండగా అనేక విమర్శలను ఎదుర్కొన్నారు. అయినప్పటికీ అంచలమైన విశ్వాసంతో ఇప్పుడు ఐరోపా ఖండంలోని అతిపెద్ద పర్వతమైన ఎల్బ్రస్ పర్వతాన్ని అలవోకగా అధిరోహించి అందరి ప్రశంసలు పొందుతున్నారు. 18,510 అడుగుల ఎత్తులోవున్న రష్యాలోని ఈ పర్వతాన్ని సోమవారం అధిరోహించిన అన్నపూర్ణ సౌదీకి తిరుగు ప్రయాణమయ్యారు. గల్ఫ్‌దేశాలలో పాఠశాలలకు సెలవులు కావడంతో ఎల్బ్రస్ పర్వతారో హణకు బయలుదేరిన ఆమె తన సంకల్పాన్ని దిగ్విజయంగా పూర్తిచేశారు. తన బాల్యంలో తాడేపల్లి కొండలపైకి ఎక్కడం తనకుఆసక్తిగా వున్నప్పటికీ... పర్వతారోహణ చేయడాన్ని అప్పట్లో ఎవ్వరూ స్వాగతించలేదని, దీంతో తాను తన ప్రయత్నాలను విరమించుకున్నానని అన్నపూర్ణ తెలిపారు. కానీ, తనకు మహేశ్‌రెడ్డితో వివాహమైన తర్వాత సమీప కొండలన్నీ ఎక్కానని గుర్తుచేసుకున్నారు. తొలిసారిగా 12,500 ఎత్తులో వున్న హిమాలయ పర్వతాలలోని ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ఉత్తర కాశీ జిల్లా కేదరకంఠ పర్వతాన్ని 2022లో అధిరోహించానని చెప్పారు. గతేడాది ఆఫ్రికాలోని ఎత్తయిన టాంజానియా లోని కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించారు. జీవశాస్త్ర ఉపాధ్యాయురాలైన అన్నపూర్ణ బాలికలు వ్యాయామ విద్యలో మరింత రాటుదేలాలని అభిప్రాయ పడ్డారు. గల్ఫ్ దేశాల నుంచి ఒక తెలుగు మహిళ ఐరోపాలోని ఎత్తయిన పర్వతాన్ని అధిరోహించడం పట్ల సౌదీ అరేబియాలోని తెలుగు ప్రవాసీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ళ నాగేశ్వరరావు

ఎసెన్షియా కర్మాగారం

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు

వినుకొండ టౌన్ ఆగస్టు 22: అనకాపల్లి జిల్లా అచ్చుతాపురం పార్మా సెజ్ ఎసెన్షియా కర్మాగారంలో జరిగిన దుర్ఘటనలో బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎసెన్షియా పార్మాకంపెనీలో వరుస సంఘటనలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిదంగా దేశంలో మహిళలు, బాలికలపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని, ఇటువంటి ఘటనల్లో నిందితులకు వెంటనే శిక్షపడేలా చట్టాలు ఉండాలన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చి 9 వారాలు అయిందని, ప్రభుత్వాలు ఏవైనా సీపీఐ ఎప్పుడూ ప్రజల పక్షమేనన్నారు. వినుకొండలో బ్రహ్మనాయుడు మాత్రం నీచరాజకీయాలు పాల్పడ్డారని అన్నారు. సమావేశంలో మారుతీ వరప్రసాద్, సంద్రపాటి సైదా, శ్రీనివాసరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తాత,మనవడు మృతి

తుళ్లూరు, ఆగస్టు 22: రోడ్డు ప్రమాదంలో తాత, మనవడు మృతి చెందిన ఘనట బుధవారం రాత్రి జరిగింది. తుళ్లూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమరావతి మండలం వైకుంఠపురం గ్రామానికి చెందిన గంగోలు దోర్నేష్ ఆయన మనవడు గంగోలు అవినాశ్(13) టీవీఎస్ మోపెడ్‌పై దొండపాడులో జరిగే ఒక కార్యక్రమానికి వస్తున్నారు. అమరావతి వైపు వెళ్లే కారు మోపెడ్‌ను హరిశ్చంద్రపురం వద్ద ఢీ కొట్టగా దోర్నేష్ అక్కడకక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అవినాశ్‌ను చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ బాలుడు అవినాష్ ఆస్పత్రిలోనే మృతిచెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తుళ్లూరు పోలీసులు గురువారం తెలిపారు.


రాజీనామా పత్రాన్ని అందిస్తున్న నరసింహారావు

వైసీపీకి మాచర్ల మున్సిపల్ వైస్ చైర్మన్

పోలూరి నరసింహారావు రాజీనామా

మాచర్లటౌన్, ఆగస్టు 22: మాచర్ల మున్సిపల్‌వైస్ చైర్మన్, వైసీపీ నేత పోలూరి నరసింహారావు గురువారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని వైసీపీ పట్టణ అధ్యక్షుడు పోలా శ్రీనివాసరావుకు అందజేశారు. అనివార్య కారణాలతో తాను వైసీపీకి రాజీనామా చేసినట్లు అయన తెలిపారు. మున్సిపల్ చైర్మన్ చిన ఏసోబు అనారోగ్య కారణాలతో తన పదవికి రాజీనామా చేశారు. కాగా శుక్రవారం పురపాలక సంఘ కార్యాలయంలో శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి సమక్షంలో మున్సిపల్ చైర్మన్‌గా పోలూరి నరసింహారావు బాధ్యతలు చేపట్టనున్నారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, ఆగస్టు 22: నాగార్జున సాగర్ జలాశయం నీటి మట్టం గురువారం నాటికి 589.00 అడుగులు ఉంది. ఇది 309.05 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7978 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8280, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,597, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్‌ఎల్‌సీ ద్వారా 600 క్యూసెక్కులు, మొత్తం అవుట్ ఫ్లో 48,255 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 34,745 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.


1.01 ఎంయూల విద్యుదుత్పత్తి

- పులిచింతలకు 27023 క్యూసెక్కులు విడుదల

రెంటచింతల, ఆగస్టు 22: సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జున సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో రెండు యూనిట్ల ద్వారా బుధవారం అర్ధరాత్రి 12గంటలవరకు 1.01 ఎంయూల విద్యుత్ తయారైనట్లు ఎస్‌ఈ కే.వెంకటరమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు గేట్లను మీటర్నర మేర ఎత్తి 18574, టేల్ రేస్ ఛానల్ ద్వారా 8449 మొత్తం 27023 క్యూసెక్కులు నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన సాగర్ నుంచి 27 వేల క్యూసెక్కులు వచ్చి చేరుతోందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 7.02 టీఎంసీలు ఉండగా, అది 75.42 మీటర్లకు సమానమన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 22 : అచ్చంపేట, ఆగస్టు 22 : పులిచింతల ప్రాజెక్టులో గురువారం 42.16 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి 28,874 క్యూసెక్కులు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద 33,624 క్యూసెక్కులు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. వీటిలో పవర్ జనరేషన్ ద్వారా 16వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.


ప్రకాశం బ్యారేజి నుండి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు

బ్యారేజి దిగువకు 14,600 క్యూసెక్కులు

- డెల్టా కాలువలకు 17, 644 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 22: ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు నీటిని విడుదల కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు నుండి 32,244 క్యూసెక్కులు బుధవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ అజముద్దీన్ ఒక ప్రటనలో పేర్కొన్నారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా 20 గేట్లను 1 అడుగు ఎత్తి దిగువకు 14,600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 17,644 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.


ఆడిట్ కమిషనర్ ఆనంద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్నరాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

సీజీఎస్‌టీ ఆడిట్ రాష్ట్ర కార్యాలయాన్ని గుంటూరుకు తీసుకురావాలి

- రాష్ట్ర కమిషనర్‌కు సీబీఐసీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం విజ్ఞప్తి

గుంటూరు, ఆగస్టు 22: కేంద్రప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం విశాఖప ట్నంలో ఉన్న సీజీఎస్‌టీ ఆడిట్ కమిషనరేట్ రాష్ట్ర ప్రధాన కార్యాలయాన్ని గుంటూరుకు తరలించాలని ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్‌శాఖకు చెందిన రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేస్తుంది. ఈ మేరకు సెంట్రల్ జీఎస్టీ రాష్ట్ర ఆడిట్ కమిషనర్ పి.ఆనంద్ కుమార్‌ను గుంటూరు కాకాని రోడ్డులోని సీజీఎస్టీ ఆడిట్ సర్కిల్ కార్యాలయంలో గురువారం పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు కలిసి వినతిపత్రం అందచేశారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టి.వివేకానంద, గద్దె తిలక్‌లు మాట్లాడుతూ విశాఖపట్నం కేంద్రంగా ఉన్న సెంట్రల్ జీఎస్టీ చీఫ్ కమిషనర్ కార్యాలయం అమరావతికి, విశాఖ ఆడిట్ కమిషనరేట్ కార్యాలయం గుంటూరులో ఏర్పాటు చేయాలని పది సంవత్సరాల క్రితమే సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్ డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. కానీ అప్పటి నుంచి ఇప్పటివరకు కూడా ఎలాంటి మార్పు జరగలేదన్నారు. శాఖా పరంగా ఢిల్లీ నుంచి జారీ అవుతున్న అధికారుల బదిలీ ఉత్తర్వుల్లో కూడా ఆడిట్ పోస్టింగ్స్ విషయంలో విశాఖ ఆడిట్ అని కాకుండా గుంటూరు ఆడిట్ అనే పేర్కొంటున్నారన్నారు. కానీ ఇక్కడ పరిస్థితి ఢిల్లీ అధికారులకు తెలియటంలేదన్నారు. సెంట్రల్ జీఎస్టీ రాష్ట్ర ఆడిట్ కమిషనర్‌గా నూతనంగా నియమితులైన పి.ఆనంద్ కుమార్ ఈ విషయంలో చొరవ తీసుకొని ఆడిట్ హెడ్ క్వార్టర్స్‌ను విశాఖ నుంచి గుంటూరుకు తక్షణమే తరలించాలని విజ్ఞప్తి చేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సంఘనాయకులు పీవీ సత్యనారాయణ, గుమ్మడి సీతారామయ్య చౌదరి, పి.కోటేశ్వరరావు, సామ్రాజ్యం ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు..


రామ్‌చరణ్ మృతదేహం

దాచేపల్లి, ఆగస్టు 22: రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన ఘటన గురువారం పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని భవ్య సిమెంట్ పెట్రోలు బంక్ సమీపంలో జరిగింది. పిడుగురాళ్ల మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కోంద్రు రామ్‌చరణ్ (17), అతని స్నేహితులు బీసపోగు ఉదయ్‌కుమార్, గింజమూరి చిన వెంకయ్యలు ద్విచక్రవాహనంపై దాచేపల్లి వైపు వస్తున్నారు. వేగంగా ప్రయాణిస్తున్న వారి ద్విచక్ర వాహనం దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని భవ్య సిమెంట్ పెట్రోలు బంక్ వద్ద ముందుగా వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో రామ్‌చరణ్ అక్కడిక్కడకే మృతి చెందగా, స్నేహితలు ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని దాచేపల్లిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. మృతుడు రామ్‌చరణ్ 10వ తరగతి వరకు చదివి కూలీపనులకు వెళ్తున్నాడు. మృతునికి తండ్రి కోటయ్య, తల్లి కోటేశ్వరి, 7వ తరగతి చదువుతున్న తమ్ముడు వున్నారు. దాచేపల్లి ఎస్ఐ సంధ్యారాణి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

31న ఏపీ స్టేట్ పికిల్‌బాల్ పోటీలు

గుంటూరు(తూర్పు), ఆగస్టు 22: ఏపీ స్టేట్ పికిల్ బాల్ అసోసియేషన్, వీవీవీ హెల్త్‌హబ్ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 31 నుంచి రెండు రోజుల పాటు తొలి ఏపీ స్టేట్ పికిల్ బాల్ ఛాంపియన్‌షిప్ బాలుర పోటీలు నిర్వహిస్తున్నట్టు పోటీల నిర్వాహక కార్యదర్శి టీ.అరుణ్ కుమార్ తెలిపారు. గుంటూరు, హనుమాన్ నగర్ 1వ లైన్‌లోని వీవీవీ హెల్త్ హబ్ లోని పికిల్‌బాల్ కోర్టులో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం పోటీల పోస్టర్లను నిర్వాహకులు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అండర్ -14, 19 సింగిల్స్ తోపాటు 35 ప్లస్, 50 ప్లస్ పురుషులు, డబుల్స్ ఓపెన్ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు జరుగు తాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎన్.శ్రీధర్, టెన్నిస్ కోచ్ జీవీఎస్ ప్రసాదు, ఆనంద్‌కుమార్, నాగరాజు, బాలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అబ్దుల్ జలీల్ తదితరులు

24,25 తేదీల్లో రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీలు

చిలకలూరిపేట, ఆగస్టు 22 : పల్నాడు జిల్లా చిలకలూరిపేట సీఆర్ క్లబ్‌లో ఈనెల 24, 25 తేదీల్లో ఏపీ స్టేట్ క్యారమ్స్ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి శ్రీగిరిరాజు కృష్ణమూర్తి స్మారక సెకెండ్ ర్యాంకింగ్ క్యారమ్స్ పోటీలను నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర క్యారమ్స్ సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ గురువారం తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 150 మంది క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. పురుషులకు, మహిళలకు వేర్వేరుగా ఈ పోటీలు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్ర సెక్రటేరియట్ నుంచి పలువురు ఉద్యోగులతో పాటు జాతీయస్థాయి క్రీడాకారులైన జనార్ధన రెడ్డి, వైఎస్‌డీ రమేష్, ఎంఎస్‌కే హారిక, ఎస్‌కే హుస్నా సమీర తదితరులు పాల్గొంటున్నట్టు వివరించారు. చీఫ్ రఫరీగా డీఎస్‌ఆర్ మూర్తి, అసిస్టెంట్ రిఫరీగా సిరాజ్ అహమ్మద్‌లతో పాటు మరో 8 మంది రిఫరీలు ఉంటారని, అబ్జర్వర్‌గా జే మురళీకృష్ణ వ్యవహరిస్తారని తెలిపారు. సమావేశంలో పల్నాడు జిల్లా క్యారమ్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చల్లగుండ్ల అజయ్ బాబు, బోయపాటి రవితేజ, సీఆర్ క్లబ్ ఉపాధ్యక్షులు చెరుకూరి కాంతయ్య, నిర్వాహక కార్యదర్శి ఎస్‌వీ రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

57,271 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 52,263 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 57,271 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 19,564 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	16500	334	8500	15000
నెంబరు. 5	9000	15800	నెంబరు. 5	10500	13000
273	10500	16500	273	10000	12500
341	8500	15000	341	9000	16000
4884	11500	12700	4884	14500	15500
సూపర్ 10	--	--	సూపర్ 10	10500	10500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18700	తేజ	8000	18800
బ్యాడిగి	8000	16000	బ్యాడిగి	8800	16500
దేవనూరు డీలక్స్	8500	13000	దేవనూరు డీలక్స్	8500	14000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	6000	11000

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

వివక్ష లేకుండా అభివృద్ధి చేసి చూపిస్తాం : నసీర్


సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు సిటీ, ఆగస్టు 22: కూటమి ప్రభుత్వంలో ఎటువంటి వివక్ష లేకుండా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ కార్పొరేటర్లు గెలిచిన ప్రాంతాలలో అభివృద్ధి పనులు చేయకుండా వివక్ష చూపారని, కూటమి ప్రభుత్వంలో అటువంటి పరిస్థితి లేకుండా చూడాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గురువారం 9వ డివిజన్ ఆంజనేయస్వామి గుడి రోడ్డులో రూ.46.50 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లైన్‌లకు ఆయన శంకుస్థాపన చేశారు. పాత గుంటూరులో ఉన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలు త్వరలోనే పరిష్కరించబోతున్నామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్లావుల అశోక్, జాగర్లమూడి శ్రీనివాస్, జస్వంత్, అల్లం బాజీ, జడ సురేష్, వెంకటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

వీవీఐటీలో 'స్పర్ధ-2కే24' ప్రారంభం

పెదకాకాని, ఆగస్టు 22 : వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాల (వీవీఐటీ)లో అసోసియేషన్ ఫర్ కంప్యూటింగ్ మిషనరి (ఏసీఎం) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఆగస్టు 22, 23 తేదీల్లో రెండ్రోజుల పాటు నిర్వహించు స్పర్ధ-2కే24 సాంకేతిక సదస్సును గురువారం ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 36 కళాశాలల నుంచి 210 గ్రూపులు, 4278 మంది విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొననున్నారు. రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో అల్గో ఆరేనా, ట్రెజర్ ట్రూపర్, గేమ్ ఆఫ్ కోడ్, రిడిల్ ర్యాంపేజ్ వంటి అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నారు. ఈ సదస్సుకు హాజరైన విద్యార్థులకు అత్యాధునిక వర్చువల్ రియాలిటీ సాంకేతికతతో ఆటలు ఆడించారు. ఈ వేడుకల్లో భాగంగా సాంకేతిక నైపుణ్యాల పెంపుదల, సామాజిక మాధ్యమాల వినియోగం వంటి అంశాలపై విద్యార్థులకు సదస్సులు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా ప్రముఖ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ సంస్థ సిర్కానా, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ టీమ్ లీడ్ డాక్టర్ రాజేష్ బండికల్ల హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీఎం క్రానికల్ 2024 పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ విద్యార్థులు అధునాతన సాంకేతికతను ఎల్లప్పుడూ అందిపుచ్చుకోవాలని అన్నారు. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు నూతన సాంకేతికతను, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.



వీవీఐటీలో స్పర్ధ 2కే24 సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు

ఇండియన్ బ్యాంకులో ఖాతాదారులకు మెరుగైన సేవలు

● సాంబశివపేట బ్రాంచ్ మేనేజర్ పూర్ణచంద్రరావు

గుంటూరు, ఆగస్టు 22: ఇండియన్ బ్యాంకులో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు సాంబశివపేట బ్రాంచ్ మేనేజర్ జి.పూర్ణచంద్రరావు తెలిపారు. ఇండియన్ బ్యాంకు 118వ వ్యవస్థాపక దినోత్సవంతోపాటు కస్టమర్ మీట్ కార్యక్రమం గురువారం బ్రాంచ్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖాతాదారుల దీర్ఘకాల, విశ్వసనీయ మద్దతుతో తమ బ్యాంక్ రూ.12.20 లక్షల కోట్ల వ్యాపారానికి చేరుకున్నట్లు తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కలిపి 5846 బ్రాంచ్‌లున్నాయని, సమాజంలో అందరి అవసరాలను తీర్చటానికి బ్యాంకు అనేక రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డిజిటల్ లావాదేవీల్లో భాగంగా నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ (ఇండా స్మార్ట్), సౌండ్ బాక్స్ కూడిన క్యూఆర్ కోడ్లు, డెబిట్, క్రెడిట్ కార్డులు, పీవోఎస్‌లు తదితర విభాగాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎన్ఆర్ఐ కస్టమర్ల కోసం 24 గంటల కస్టమర్ల కాల్ కోసం హాజరవడానికి (044-28882999) ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్‌ను కూడా ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఖాతాదారులకు ప్రభుత్వ, బ్యాంకు పాలసీలను వివరించారు.


ఖాతాదారులకు పాలసీ ఖాతాలను అందజేస్తున్న బ్యాంకు అధికారులు

వెనుకబడిన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

● కమిషనర్ శ్రీనివాసులుకు ప్రజాసంఘాల నాయకుల విజ్ఞప్తి

గుంటూరు, ఆగస్టు 22: నగరంలో ముఖ్యంగా బడుగు, బలహీనవర్గాల ప్రజలు నివసించే వెనుకబడిన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని కమిషనర్ పులి శ్రీనివాసులును పలు ప్రజాసంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఇటీవల నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులును గురువారం పలువురు ప్రజాసంఘాల నాయకులు పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలియజేశారు. మైనార్టీ ప్రజలు నివసించే కాలనీల్లో కాల్వలు, రోడ్లు లేక కలుషిత నీటితో తీవ్ర ఇబ్బందులు పడుతోన్న కాలనీల్లో సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రజక జనసేవాసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు, బహుజన మహాసభ కేంద్ర కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్‌సింగ్, సంఘాల నాయకులు సైదా, ప్రసాదరావు, నరసయ్య, చెంచమ్మ తదితరులున్నారు.

వేదసీడ్స్ కార్యాలయంలో చిరంజీవి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్, తులసీ ధర్మచరణ్ తదితరులు

గుంటూరు, ఆగస్టు 22: అరండల్‌పేట 11/3 లోని వేద సీడ్స్ ప్రధాన కార్యాలయంలో సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసీ ధర్మచరణ్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్‌లు అభిమానులతో కలసి కేక్ కట్ చేసి చిరంజీవికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ సినిమా రంగంలో, నిజ జీవితంలో మెగాస్టార్ చిరంజీవి అలుపెరగని సూర్యుడని అన్నారు. ఈడీ తులసి ధర్మచరణ్ మాట్లాడుతూ చిరంజీవి అనే నాలుగు అక్షరాలు యావత్ ప్రపంచానికి పరిచయం అక్కరలేని హీరో అని, ఆయన ఓ కళాకార్మికుడని, సినిమా మీద అయనకున్న ప్రేమ మాటల్లో చెప్పలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో తోట రంగారావు, గుడి సతీష్ కుమార్, తాయి శ్రీనివాసరావు, తేలప్రోలు వెంకట్రావు, ఆళ్ళ భాస్కర్, గాజుల సాయిరాం, పసుపులేటి రమేష్, వేద సీడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బాధ్యతలు స్వీకరించనున్న వెస్ట్ డీఎస్పీ


డీఎస్పీ జయరామ్ ప్రసాద్

గుంటూరు, ఆగస్టు 22 : గుంటూరు వెస్ట్ డీఎస్పీగా నియమితులైన బియ్యం జయరాం ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం ఆయన విశాఖపట్నం ఈస్ట్ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన బదిలీల్లో భాగంగా ప్రసాదను వెస్ట్ డీఎస్పీగా నియమించారు జయరాం ప్రసాద్ 2018లో గ్రూప్ వన్ ద్వారా ఎంపికై డీఎస్పీగా నియమితులయ్యారు. ఆయన డీఎస్పీగా తొలి పోస్టింగ్ పల్నాడు జిల్లా గురజాలలో రెండున్న రేళ్లు విధులు నిర్వహించారు. ఆ తర్వాత తొమ్మిది నెలల పాటు కాకినాడ దిశ డీఎస్పీగా పనిచేశారు. ఆ తర్వాత విశాఖపట్నం ఈస్ట్ జోన్ ఏసీపీగా గడిచిన ఏడు నెలల విధులు నిర్వహిస్తూ తాజాగా గుంటూరు వెస్ట్ డీఎస్పీగా నియమితులయ్యారు. శుక్రవారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

భారీ వర్షం.. రోడ్లన్నీ జలమయం

● పొంగి పొర్లిన డ్రెయిన్లు
● ఎక్కడికక్కడ గంటల తరబడి స్తంభించిన ట్రాఫిక్
● శివారు ప్రాంతాల్లోని నివాసాల్లోకి వర్షం నీరు
● ఇబ్బందులు పడుతున్న నగర ప్రజానీకం


బ్రాడీపేట 4/14లో నిలిచిన వర్షపు నీరు

గుంటూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. గురువారం మధ్యాహ్నం నుంచి మేఘావృతమై ఉన్న వాతావరణం సాయంత్రం 5 గంటల సమయంలో దట్టమైన మబ్బులు అలుముకొని కాసేపటికే వర్షం కురవడం ప్రారంభించింది. అది మొదలుకొని గంట పాటు ఎడతెరపి లేకుండా క్లౌడ్ బరస్ట్ అయిందా అనే రీతిలో వర్షం కురుస్తూనే ఉన్నది. దాంతో వరదనీరు ఒక్కసారిగా రోడ్లపై నుంచి కాలువల్లోకి చేరడంతో ముందుకు ప్రవహించే పరిస్థితి లేక పొంగి పొర్లింది. జిల్లా కేంద్రమైన గుంటూరు నగరంలో ప్రధాన రహదారులు జలమయం కావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి. వర్షం వెలిశాక ఒక్కసారిగా వేల సంఖ్యలో వాహనదారులు ఇళ్లకు వెళ్లేందుకు రోడ్ల పైకి రావడంతో పలు మార్గాల్లో ట్రాఫిక్‌ని మళ్లించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది.


కంకరకుంట అండర్‌పాస్‌లో నిలిచిన వర్షపు నీరు

దాదాపుగా ఆగస్టు నెల ప్రారంభం నుంచి జిల్లా వ్యాప్తంగా వరుణిడి జాడ లేక ఒకవైపు, ఎండ తీవ్రతతో మరోవైపు ప్రజలు ఉక్కిరిబిక్కిరికి గురౌతున్నారు. వేసవికాలంలో కంటే విద్యుత్ వాడకం పీక్ స్టేజ్‌కు చేరుకొన్నది. ఇదే సమయంలో పత్తి, మిర్చి వంటి వర్షాధార పంటలు వేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక్క వర్షం అయినా కురవాలని నిత్యం ప్రార్థిస్తున్నారు. వారి మొర వరుణుడు ఆలకించినట్లుగా గురువారం గంట పాటు జిల్లాలోని ఫిరంగిపురం, గుంటూరు నగరం, తాడేపల్లి, మంగళగిరి, తుళ్లూరు, తాడికొండ, ప్రత్తిపాడు, మేడికొండూరు, కొల్లిపర తదితర మండలాల్లో కుండపోతగా వర్షం కురిసింది. ఒక్క ఫిరంగిపురంలోనే 9 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. గుంటూరు నగరంలో దాదాపుగా మూడు సెంటీమీటర్ల వర్షపాతం కురిసింది.

వర్షంతో కలెక్టరేట్, జిల్లాపరిషత్తు, జిల్లా కోర్టు, పోలీసు శాఖ కార్యాలయాల్లో అడుగు లోతు వర్షం నీరు చేరింది. దాంతో వాహనాలు బయటకు తీయడం ఉద్యోగులకు కష్టమైంది. వర్షం కారణంగా నగరంలోని పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దాదాపుగా రెండు గంటల అనంతరం ఆయా కాలనీల్లో విద్యుత్ సరఫరాని పునరుద్ధరించారు. రోడ్ల పైకి చేరిన వరదనీరు లక్ష్మీపురం, బ్రాడీపేట, అరండల్‌పేట, బృందావన్‌గార్డెన్స్ తదితర ప్రాంతాల్లోని అపార్టుమెంట్లలోకి చేరడంతో వాహనాలు నీట మునిగాయి. డొంకరోడ్డు, కంకరగుంట ఆర్‌యూబీల వద్ద వరదనీరు ప్రమాదకర స్థాయిలో ప్రవహించింది. దాంతో అటుగా చాలా సేపు వాహనాల రాకపోకలు పోలీసులు నిలిపేశారు. మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కూడా వర్షం నీరు భారీగా చేరి నిలిచిపోవడంతో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పలువురు అధికారులకు ప్రత్యేక డ్యూటీలు వేసి వరదనీరు డ్రెయిన్లలోకి ప్రవహించేలా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. అలానే వర్షం కారణంగా తాగునీటి సరఫరాకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ఇక శివారు కాలనీల్లోకి వర్షం నీరు చేరి ఖాళీస్థలాల్లో నిలిచిపోయింది. కొన్ని పూరిళ్లల్లోకి వర్షం నీరు చేరినట్లు పొన్నూరు రోడ్డు, కేవీపీ కాలనీ పరిసర ప్రాంతాల ప్రజలు తెలిపారు.

ప్రధాన రోడ్లు, కూడళ్లలో నిలిచిన ట్రాఫిక్

గుంటూరు, ఆగస్టు 22 : నగరంలో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి నగరవాసులు నరకం చవిచూశారు. ప్రధానంగా స్కూళ్ళు, కళాశాలలు వదిలే సమయం కావడంతో భారీ వర్షానికి విద్యార్థులు వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదే సమయంలో ఎక్కడా ట్రాఫిక్ పోలీసులు రోడ్లపై కనిపించకపోవడంతో విద్యాసంస్థలు ఉండే ప్రాంతాలతో పాటు నగరంలోని ప్రధాన కూడళ్ళలో సైతం వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయాయి. బస్సులు, కార్లు, ఆటోలు ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో అనేక జంక్షన్లు వాహనాల రద్దీతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. నగరంలోని రింగు రోడ్డుతో సహా అనేక రోడ్లలో వర్షపు నీరు మోకాలు లోతు కంటే ఎక్కువ కావడంతో కార్లు సైతం కదలలేని స్థితిలో నిలిచిపోయాయి.


కొరిటపాడు మెయిన్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు


పట్టాభిపురం నాలుగో లైన్‌లో ఇళ్లలోకి చేరిన వర్షపు నీటిని తోడుతున్న మహిళ

అనధికార ప్రకటనల హోర్డింగ్స్‌పై కమిషనర్ కన్నెర్ర

● ఫుట్‌పాత్‌లు, రోడ్ల ఆక్రమణలు, ఫ్లెక్సీల తొలగింపు
● వారం రోజుల యాక్షన్ ప్లాన్
● నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



నగరంలో అనధికార హోర్డింగులు తొలగిస్తున్న సిబ్బంది

గుంటూరు(కార్పొరేషన్), ఆగస్టు 22 : నగరపాలక సంస్థ అనుమతితో నగరంలో ఏర్పాటు చేసిన ప్రతి ప్రకటన బోర్డు నిర్దేశిత మీడియా డివైజ్ డిస్ప్లే ఫీజులు చెల్లించాలని, అనుమతి లేని బోర్డులను తొలగిస్తామని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం పట్టణ ప్రణాళిక అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో ఫీజులు చెల్లించని, అనధికార హోర్డింగులు, బోర్డులను, ఫ్లెక్సీలను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో నగరపాలక సంస్థ నుంచి అనుమతి పొందిన ప్రకటనల హోర్డింగ్స్ యజమానులు మీడియా డివైజ్ డిస్ప్లే ఫీజులు సక్రమంగా చెల్లించాలని, లేకుంటే సదరు బోర్డులను తొలగించి, ఫీజుల వసూళ్లకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బుధవారం నుంచి పట్టణ ప్రణాళిక అధికారులు నగరంలో సుమారు 120కి పైగా అనధికార హోర్డింగ్‌లను తొలగించారన్నారు. నగరంలో వార్డు సచివాలయాల వారీగా ప్లానింగ్ కార్యదర్శులు అనధికార, ఫీజులు చెల్లించని బోర్డులను గుర్తించి వాటిని తొలగించాలన్నారు. పలు ప్రాంతాల్లో ఇష్టానుసారం ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారని, వాటిని కూడా తొలగించాలన్నారు. పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా రోడ్ల విస్తరణ చేస్తున్నామని, కొందరు రోడ్ల మీద వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్‌కి అంతరాయం కలిగిస్తున్నారన్నారు. రోడ్, ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపులో కూడా రాజీపడకూడదన్నారు. పట్టణ ప్రణాళిక అధికారుల ద్వారా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, తమ క్షేత్ర స్థాయి పర్యటనలో ఎక్కడైనా అనధికార బోర్డులు గుర్తిస్తే సంబంధిత కార్యదర్శిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రకటనల బోర్డుల నిర్వాహకులు తప్పనిసరిగా బకాయిలతో పాటుగా ప్రస్తుత ఏడాది డిమాండ్ కూడా చెల్లించాలన్నారు.

ఆరోగ్యంపై ఉద్యోగులు శ్రద్ధ చూపాలి

● సీజీఎస్టీ గుంటూరు కమిషనర్ నరసింహారెడ్డి

గుంటూరు, ఆగస్టు 22 : ఆరోగ్యంపై ఉద్యోగులు శ్రద్ధ చూపాలని, వ్యాయామానికి కొంత సమయం కేటాయించాల్సిన అవసరం ఉందని సెంట్రల్ జీఎస్టీ గుంటూరు కమిషనర్ సాధు నరసింహారెడ్డి తెలిపారు. కన్నావారితోటలోని సెంట్రల్ జీఎస్టీ గుంటూరు కమిషనరేట్ కార్యాలయంలో గురువారం కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కళ్ళను ఒక అవయవంగా, కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలను నొక్కి చెప్పారు. వాసన్ ఐ కేర్ ఏర్పాటు చేసిన ఈ వైద్యశిబిరంలో చాలా మంది అధికారులు, డ్రైవర్లు కాంటిజెంట్‌లు పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, జాయింట్ కమిషనర్ లక్ష్మీనారాయణ, ఏసీ నాగరాజు, పలువురు సూపరింటెండెంట్‌లు హాజరయ్యారు.


కంటి వైద్య శిబిరంలో వైద్యులు, అధికారులతో కమిషనర్ సాధు నరసింహారెడ్డి


ఈడీ ఆదంసాహెబ్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న డీఎం అబ్దుల్ సలాం, పక్కన డీటీవో రవికాంత్

గుంటూరు- 2 ఆర్టీసీ డీఎంకు ప్రశంసాపత్రం

గుంటూరు, ఆగస్టు 22: ప్రతి నెలా పౌర్ణమికి అరుణాచలంనకు ప్రత్యేక సర్వీసు లు అత్యధిక స్థాయిలో ఆపరేట్ చేయటంపై ఆర్టీసీ ఎండీ నుంచి గుంటూరు-2 డిపో మేనేజర్‌కు ప్రశంసాపత్రం అందింది. 2023-24 సంవత్సరంలో ప్రతి నెలా పౌర్ణమికి గుంటూరు నుంచి అరుణాచలంనకు స్పెషల్ ఆపరేట్ చేసి రూ.9.21 లక్షల అదనపు ఆదాయాన్ని ఆర్టీసీకి సమకూర్చటంపై గుంటూరు-2 డిపో మేనేజర్ షేక్ అబ్దుల్ సలాంను అభినందిస్తూ ఎండీ ద్వారకా తిరుమలరావు ప్రశంసాపత్రాన్ని పంపించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ నెల్లూరు జోన్ ఈడీ ఆదాం సాహెబ్, జిల్లా ప్రజా రవాణాధికారి రవికాంత్‌ల చేతుల మీదుగా డీఎం ప్రశంసా పత్రాన్ని గురువారం అందుకున్నారు. భక్తుల అవసరాలకు అనుగుణంగా మరిన్ని దేవాలయాలకు సర్వీసులను అందుబాటులోకి తీసుకురావాలని ఈడీ కోరారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

● డ్రగ్స్‌కు అలవాటు పడిన యువకులకు అదనపు ఎస్పీ కౌన్సెలింగ్

గుంటూరు, ఆగస్టు 22 : గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ అరండల్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కాకుమానువారితోట, డొంకరోడ్డు, సంజీవనగర్, బొంగరాలబీడు ప్రాంతాల్లో నివాసం ఉంటూ మత్తు పదార్థాలకు అలవాటు పడ్డ కొంతమంది యువకులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా క్రైం అడిషనల్ ఎస్పీ ఎ.శ్రీనివాసరావు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంతో భవిష్యత్తు ఉన్న మీరు మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. ఈ మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యం క్షీణించి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. మరలా మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ దృష్టికి వచ్చినట్లయితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తల్లిదండ్రులు పిల్లల విషయంలో బాధ్యతగా ఉంటూ వారి కార్యకలాపాలపై దృష్టి సాధించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అరండల్‌పేట సీఐ కె.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో స్ఫూర్తి నింపడమే ఇన్‌స్పైర్ లక్ష్యం

● డీవైఈవో వెంకటేశ్వరరావు


శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

గుంటూరు(విద్య), ఆగస్టు 22: విద్యార్థుల్లో స్ఫూర్తి నింపి వారిని భావి శాస్త్రవేత్తలుగా తయారు చేయడమే ఇన్‌స్పైర్ మానిక్ లక్ష్యమని డీవైఈవో పి. వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం పాతబస్టాండు వద్ద ఉన్న పరీక్షభవన్‌లో ఇన్‌స్పైర్ మానిక్ శిక్షణ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నత పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడం కోసం ఇటువంటి ప్రదర్శనలు ఉపయోగపడతాయని చెప్పారు. విద్యార్థులను ప్రాథమిక స్థాయి నుంచే ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాల స్థాయిలో ప్రాజెక్టులపై పోటీలు నిర్వహించాలని సూచించారు. వినూత్న ప్రాజెక్టులను మాత్రమే నామినేషన్‌కు పంపాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ షేక్ గౌసుల్‌మీరా, శివ నాగేశ్వరరావు, గంగాధర్, జాకీర్‌హుస్సేన్, జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్, ఎంఈవో రమణయ్య తదితరులు పూర్వ సైన్స్ కోఆర్డినేటర్ ఎవి మధుకుమార్‌ను ఘనంగా సత్కరించారు.

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే అచ్యుతాపురం ప్రమాదం

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి



గుంటూరు సిటీ, ఆగస్టు 22: వైసీపీ ప్రభుత్వం భద్రతా ప్రమాణాలు పాటించకుండా ఫార్మా కంపెనీలపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల అచ్యుతాపురం ఘటన జరిగి అనేక మంది మృతి చెందారని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి విమర్శించారు. గురువారం అచ్యుతాపురం ఘటనపై ఎమ్మెల్యే ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదం తనను తీవ్రంగా కలిచి వేసిందని అన్నారు. వైసీపీ నేతలు వెంటనే ప్రభుత్వంపై బురదజల్లే విధంగా అసత్య ఆరోపణలు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడవకముందే ఈ ఘటనకు టీడీపీదే బాధ్యత అనటం హేయమైన చర్య అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 119 ప్రమాదాలు విశాఖపట్నంలోనే జరగ్గా, 120 మంది చనిపోయారని అప్పుడు ఆ పార్టీ నేతలు అందరూ ఎక్కడికి పోయారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఫార్మా కంపెనీకి ఇద్దరు యజమానులు అని, ఇద్దరి మధ్య కలహాల నేపథ్యంలో కంపెనీ భద్రతను గాలికి వదిలేశారని తెలుస్తుందన్నారు. ఘటన జరిగిన వెంటనే హోంమంత్రి హుటాహుటిన విశాఖకు చేరుకొని సహాయక చర్యలను వేగవంతం చేసి మృతుల సంఖ్యను తగ్గించగలిగారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బాధితులందరికీ అండగా నిలవడం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు క్షతగాత్రులను, మృతుల కుటుంబాలను పరామర్శించి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి చొప్పున నష్టపరిహారం ప్రకటించారన్నారు.

రక్తదాన స్ఫూర్తి ప్రదాత చిరంజీవి


రక్తదాతకు ప్రశంసాపత్రం అందజేస్తున్న గాదె

గుంటూరు (మెడికల్) ఆగస్టు 22: మెగా అభిమానులను సమాజ సేవ వైపు మళ్లించి, రక్తదానాన్ని ఉద్యమంలా మార్చిన ఘనత చిరంజీవికే దక్కుతుందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు కొనియాడారు. గురువారం ప్రముఖ సినీ నటుడు చిరంజీవి 69వ జన్మదినం సందర్భంగా లాల్‌పురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో కాటూరి శ్రీనివాస్ మాస్టారు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చిరంజీవి బ్లడ్ బ్యాంక్, ఐ బ్యాంక్ ద్వారా మెగాస్టార్ చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం గాదె వెంకటేశ్వరరావు, చిరంజీవి బర్త్‌డే కేక్ కట్‌చేసి అభిమానులకు పంచారు. శిబిరంలో 50 మంది మెగా అభిమానులు, జనసైనికులు రక్తదానం చేశారు. రక్తదాతలకు గాదెతో పాటు జనసేన కార్పొరేటర్ దాసరి లక్ష్మీ తదితరులు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కాటూరి వెంకటేశ్వరరావు, కొర్రపాటి నాగేశ్వరరావు, డేగల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

● చుట్టుగుంట సెంటర్‌లోని కళాభారతి అంధుల పాఠశాలలో విద్యార్థులతో కలసి జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ల హరి కేక్ కట్ చేసి ఘనంగా చిరు పుట్టినరోజు వేడుకలు జరిపారు. అనంతరం సుగాలీకాలనీలో రెల్లి సంఘం నేత ఉదయ్‌కుమార్, కేతావత్ పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో హరి పాల్గొన్నారు.

శ్రీనివాసరావుపేటలో..

గుంటూరు సిటీ, ఆగస్టు 22: స్థానిక శ్రీనివాసరావుపేటలో చిరంజీవి పుట్టినరోజు వేడుకలను గురువారం రాత్రి ఆయన అభిమానులు, జనసేన, టీడీపీ నాయకులు కలిసి సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకుడు రామిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు నాయకుడు దాసరి రాము, మాల మహానాడు నేత గోళ్ల అరుణ్‌కుమార్, ప్రత్తిపాడు నియోజకవర్గం జనసేన సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తూర్పు నియోజకవర్గంలో చిరంజీవి పుట్టినరోజు వేడుకలు


చిరంజీవి జన్మదిన వేడుకలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు సిటీ, ఆగస్టు 22 : సినీ నటుడు చిరంజీవి జన్మదినోత్సవ సందర్భంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. గురువారం జరిగిన వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ మాట్లాడుతూ భారతదేశంలో అత్యధిక అభిమానులు కలిగిన సినీ నటుడు చిరంజీవి అని అన్నారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికులు ఏర్పాటు చేసిన చిరు జన్మదిన వేడుకల్లో నసీర్ పాల్గొని భవన నిర్మాణ కార్మికుల చిరకాల కోరిక అయిన కొణిదెల చిరంజీవి భవన్ త్వరలోనే పూర్తవుతుందని దీనికి అన్ని విధాల సహకరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్ ఎలావుల్లా అశోక్, జాగర్లమూడి శ్రీనివాస్, ఐల శీను, జడ సురేష్, శేఖర్, వెంకటేశ్వరరావు, అల్లం బాజీ, దురసాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమంపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి

గుంటూరు, ఆగస్టు 22: ఆర్థిక భరోసా లేక అనేక ఇబ్బందులు పడుతున్న వృద్ధుల సంక్షేమంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సీనియర్ సిటిజన్స్ జిల్లా ఫోరం అధ్యక్షుడు కె.సాంబయ్య తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో వృద్ధుల సంక్షేమం-సంఘాలు, ప్రభుత్వాల పాత్ర అనే అంశంపై గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ఆర్వీ సింగరయ్య, నారపరెడ్డి, ఘనశ్యామాచార్యులు, హనుమాయమ్మ తదితరులున్నారు.




బర్త్‌డే సర్‌ప్రైజ్!

మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా 'విశ్వంభర' చిత్రంలోని ఆయన లుక్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఒక రాతిపై కూర్చుని ప్రత్యేక శక్తులు కలిగిన త్రిశూలాన్ని పట్టుకుని ఉన్న మెగాస్టార్ పవర్‌ఫుల్‌గా అనిపించారు. ఆయన పుట్టినరోజున టీజర్ విడుదల ఉండదని దర్శకుడు వశిష్ఠ ముందే స్పష్టం చేయడంతో కొంత నిరాశ చెందిన మెగా అభిమానులను ఈ లుక్ సర్‌ప్రైజ్ చేసింది. 'చీకటి, చెడు ఈ ప్రపంచాన్ని ఆక్రమించినప్పుడు ఒక అద్భుతమైన తార పోరాడడానికి ప్రకాశిస్తుంది' అని చిత్రం టీమ్ ఈ పోస్టర్‌లో పేర్కొంది. 'విశ్వంభర' చిత్రం కోసం ఓ ఫాంటసీ ప్రపంచాన్ని సృష్టించారు. అద్భుతమైన డ్రామా, ఎమోషన్స్‌తో ఈ సినిమా విజువల్ వండర్‌గా ఉంటుందని నిర్మాతలు విక్రమ్, వంశీ, ప్రమోద్ చెప్పారు. అలాగే పుట్టినరోజు సందర్భంగా తండ్రితో దిగిన ప్రత్యేక ఫొటోను రామ్‌చరణ్ విడుదల చేశారు.

నచ్చితే ఎక్కడికైనా వెళతా..

"మనకు నచ్చిన వారి కోసం మనం తప్పకుండా నిలబడాలి. నాకు నచ్చినవారి కోసం ఎక్కడికైనా.. ఎంతదూరమైనా వెళతా.. ఏమైనా చేస్తా. ఈ మూవీ ఫంక్షన్ కోసం తబిత సుకుమార్ నన్ను పిలిచారు. అందుకే 'పుష్ప 2' క్లైమాక్స్ షూటింగ్‌లో ఉండి కూడా.. ఇక్కడికి వచ్చాను.



'మారుతీనగర్ సుబ్రమణ్యం' లాంటి సినిమాలు హిట్టవ్వాలి. ఇలాంటి మంచి కథలు ఉన్న చిత్రాలు మరిన్ని రావాలి అని కోరుకుంటున్నాను" అని అల్లు అర్జున్ అన్నారు. లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రావురమేశ్, అంకిత్ కొయ్య, ఇంద్రజ, రమ్య పసుపులేటి ప్రధాన పాత్రల్లో నటించారు. దర్శకుడు సుకుమార్ భార్య తబిత సుకుమార్ చిత్రాన్ని సమర్పించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్లు అర్జున్, సుకుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. సుకుమార్ మాట్లాడుతూ "ఈ సినిమాను చూశాను. చాలా బాగుంది" అని చెప్పారు. "సినిమా అనుకున్నదానికంటే బాగా వచ్చింది. ఇది టీమ్ ఎఫర్ట్" అని దర్శకుడు లక్ష్మణ్ కార్య అన్నారు.



హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ రహస్య గోరఖ్ ఒకటయ్యారు. కర్ణాటకలోని కూర్గ్‌లో బంధు మిత్రుల సమక్షంలో వీరి డెస్టినేషన్ వెడ్డింగ్ జరిగింది. వీరిద్దరికీ తొలి చిత్రం అయిన 'రాజావారు రాణీగారు'లో నటించే సమయంలో ప్రేమలో పడ్డారు. మార్చి 13న వీరి నిశ్చితార్థం జరిగింది.

ఐటమ్ సాంగ్ చేస్తుందా?



నటి శోభితా ధూళిపాళకు ఇటీవలే నాగచైతన్యతో నిశ్చితార్థం జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ అమ్మడును ఓ క్రేజీ ఆఫర్ వచ్చి తలుపు తట్టింది. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్, కియారా అడ్వానీ జంటగా తెరకెక్కనున్న 'డాన్ 3'లో ఓ ప్రత్యేక గీతంలో నటించడానికి శోభితను మేకర్స్ సంప్రదించారట. దానికి శోభిత సమ్మతించారని కొందరు, అదేంకాదు ఇంకా చర్చల్లోనే ఉందని మరికొందరు అంటున్నారు. మరి శోభిత నిజంగానే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారా.. లేదా అనేది తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే. ఆమె నిర్ణయం కోసం ఆ చిత్ర దర్శక నిర్మాతలే కాదు, అక్కినేని అభిమానులు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

కొత్త ఇంట్లో నరేశ్

సీనియర్ నటుడు నరేశ్ ఓ ఇంటి వాడయ్యారు. చిలుకూరి బాలాజీ ఆలయానికి సమీపంలో ఆయనకు ఓ వ్యవసాయ క్షేత్రం ఉంది. అందులో ఓ పెద్ద ఇల్లుని అత్యాధునిక వసతులతో నిర్మించి ఇటీవలే గృహ ప్రవేశం చేశారు. ఈ భవంతికి విజయకృష్ణ మందిరం అని పేరు పెట్టారు. ఇక్కడే హీరో కృష్ణ, ఇందిరా దేవి విగ్రహాలతో ఏర్పాటు చేసిన ఇందిరా దేవి స్ఫూర్తి వనాన్ని కూడా ఆ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా విచ్చేసిన చిత్ర ప్రముఖులకు నరేశ్, పవిత్ర స్వాగతం పలికారు. నరేశ్ కొత్త ఇంటికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.






ఇన్ ప్రోగ్రెస్

చిన్నా ఇది వింత లోకం!



నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్ కీలక పాత్రలు పోషించిన '35 చిన్న కథ కాదు' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. రానా దగ్గుబాటి సమర్పణలో సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి ఈ సినిమా తీస్తున్నారు. నందకిశోర్ ఈమని దర్శకుడు. ఈ చిత్రం నుంచి భరద్వాజ్ గాలి రాసిన 'చిన్నా.. ఇది వింత లోకం' పాటను విడుదల చేశారు. స్కూల్ ఎపిసోడ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ఈ చిత్రం క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకనిర్మాతలు చెప్పారు.

గరుడ పురాణం ఏం చెబుతోంది?



రిషి, ప్రియాంక కుమార్ జంటగా నటిస్తున్న తెలుగు, కన్నడ ద్విభాషా చిత్రం 'రుద్ర గరుడ పురాణం'. కే.ఎస్.నందీశ్ దర్శకత్వంలో విజయ్‌లోహిత్ నిర్మిస్తున్నారు. ఇటీవలే సినిమా టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు నందీశ్ మాట్లాడుతూ "ఈ సినిమా అందరికీ నచ్చుతుంది. ఇదో వైవిధ్యభరితమైన సినిమా" అని అన్నారు. "మంచి కథతో తెరకెక్కుతోన్న ఈ సినిమా అందరికీ మంచి ఫీల్ గుడ్ మూవీ చూశామనే అనుభూతిని ఇస్తుంది" అని నిర్మాత విజయ్‌లోహిత్ చెప్పారు.

బయట ప్రపంచం చాలా చెత్తగా ఉంది



'ఏ మహిళ అయినా ఎవరితోనూ తన ఇబ్బందిని చెప్పుకొనే ధైర్యం చేయలేదని అనిపిస్తేనే ఆమెను మరింత ఇబ్బందులకు గురి చేయడానికి ప్రయత్నిస్తారు. అలాంటి వారికి నో చెప్పడం నేర్చుకోవాలి' అన్నారు మంచు లక్ష్మి. చిత్ర పరిశ్రమలో మహిళా ఆర్టిస్టులను వెంటాడి వేధిస్తున్నారని జస్టిస్ హేమ కమిటీ నివేదిక వెల్లడించిన నేపథ్యంలో మంచు లక్ష్మి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆమె ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'అన్యాయం జరిగిన వెంటనే బయటకు వచ్చి మాట్లాడాల్సిన అవసరం ఉంది. అలాగే ఆర్టిస్టులు తెలివిగా నో చెప్పడం నేర్చుకోవాలి. కెరీర్ మొదలు పెట్టిన సమయంలో నన్నూ కొందరు ఇబ్బంది పెట్టారు. వారిపై గట్టిగా అరిచి నాకు వచ్చిన ఛాన్స్ పోగొట్టుకున్నా. కానీ తర్వాత అలాంటి విషయాల్లో తెలివిగా వ్యవహరించడం నేర్చుకున్నా. అప్పటికీ అవతలి వారు విసిగిస్తుంటే మనం వారికి బుద్ధి చెప్పక తప్పదు. ఎందుకంటే బయటి ప్రపంచం చాలా చెత్తగా ఉంది' అన్నారామె.

ఖాళీ స్థలాల్లో చెట్లను తొలగించండి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట ఆగస్టు 22: పట్టణంలోని ఖాళీ స్థలాలలో చెట్లను తొలగించాలని స్థల యజమానులకు పట్టణ మున్సినపల్ కమిషనర్ శేషన్న తెలిపారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో గురువారం మున్సిపల్ కమిషనర్ ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలోని ఖాళీ స్థలాలలో పిచ్చి మొక్కలు, ముళ్ళచెట్ల వల్ల దోమలు వృద్ధి చెందడానికి, వర్షపునీరు నిలువ ఉండి దోమలు పెరిగిపోయే అవకాశం ఉందన్నారు. విషసర్పాలు, క్రిమి కీటకాలు సంచరించి చుట్టుపక్కల నివసించే ప్రజలకు ఇబ్బందికరంగా ఉంటాయన్నారు. ఖాళీ స్థల యజమానులు స్థలంను బాగుచేయించి మెరక తోలించాలని సూచించారు. అలాచేయకుంటే ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల చట్టం-1965లోని సెక్షన్ 237, 247, 336లను అనుసరించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తడి, పొడిచెత్త విధానాన్ని సక్రమంగా నిర్వహించాలి

తెనాలి, మారీసుపేట ఆగస్టు 22: పట్టణంలో సేకరిస్తున్న తడిచెత్త పొడిచెత్త విధానాన్ని సక్రమంగా నిర్వహించాలని శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలను పట్టణ మున్సినపల్ కమిషనర్ శేషన్న హెచ్చరించారు. నందులపేటలోని 4వ వార్డులోని ఎంఆర్ఎఫ్ సెంటర్‌ను గురువారం పట్టణ కమిషనర్ తడిచెత్త, పొడి చెత్త సెగ్రిగేషన్ పనులను పరిశీలించి శానిటేషన్, ఎన్విరాన్‌మెంటు అధికారులకు పలు సూచనల చేశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ పట్టణంలో సేకరించే తడి, పొడిచెత్తను ఇంటి వద్దనే వేర్వేరు చేసుకోవాలన్నారు. పట్టణంలో దోమల లార్వా నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్స్, ఫాగింగ్‌ను షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తామన్నారు. పురప్రజలు కూడా చెత్తను వ్యర్థాలను మురుగు కాలువలో వేయరాదని కోరారు. పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. డ్రెయిన్‌లను, మురుగు కాల్వలను ఆక్రమించరాదని, ఆక్రమణలు జరిగితే పురపాలక సంఘ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సుందర తెనాలికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. అనంతరం 31వ వార్డులోని ఎంఆర్ఎఫ్ సెంటర్‌లో జరుగుతున్న సెగ్రిగేషన్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎల్ఐసీ ఉద్యోగులు

అత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలంటూ

ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన

తెనాలి అర్బన్, ఆగస్టు 22: కలకత్తాలో జరిగిన హత్యాచార సంఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం కో-కన్వీనర్ అండాళ్లు డిమాండ్ చేశారు. భోజన విరామ సమయంలో కొత్తపేట ఎల్ఐసీ కార్యాలయం వద్ద గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. డ్యూటీలో ఉన్న సమయంలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం చేయడం శోచనీయమన్నారు. మహిళలకు సమాజంలో భద్రత కరువవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పురుషాధిక్యతను ఛేదించి మహిళలు బయట ప్రపంచంలోకి అడుగుపెట్టి, తమ ప్రతిభను చాటుకుంటున్నా లైంగిక వేధింపులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీజీ చెప్పినట్లు ఆడపిల్లలు అర్ధరాత్రి ఒంటరిగా వెళ్లగలిగిన నాడే నిజమైన స్వాతంత్ర్యం అనే వాక్కును నిజంచేయాలని కోరారు. అత్యాచారంచేసిన నిందితులను బహిరంగంగా ఉరి తీయాలన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు జీవీ సుబ్బారావు, కార్యదర్శి కె.రాజు, ఏజెంట్లు రాజశేఖర్, వైద్యులు శారద, భీమవరపు సాంబిరెడ్డి, వాసిరెడ్డి ప్రియబాంధవి, రమ్య, చందన తదితరులు పాల్గొన్నారు.


జానపద కళారూపాలు ప్రదర్శించిన చిన్నారిని అభినందిస్తున్న కళాకారులు

ఘనంగా అంతర్జాతీయ జానపద కళాదినోత్సవం

తెనాలి అర్బన్, ఆగస్టు 22: రైల్వే స్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కళాశాలలో గురువారం అంతర్జాతీయ జానపద కళా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ పాటిబండ్ల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో విద్యార్థులనుద్దేశించి వ్యాపారవేత్త పుప్పల వరదరాజులు మాట్లాడుతూ, పల్లె ప్రజల మధ్య సహజంగా పుట్టిన కళలే జానపదాలన్నారు. జాతి నిర్మాణానికి సాంస్కృతిక వారసత్వాన్ని అర్థం చేసుకునేందుకు ఈ కళలు దోహదపడతాయని చెప్పారు. విద్యార్థులు సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కలిగి ఉండాలని, ఆందోళనతో కూడిన విద్యార్థి జీవితంలో వినోదాన్ని, ఉత్సాహాన్ని జానపదాలు అందిస్తాయన్నారు. పలువురు కళాకారులు జానపద కళలను ప్రదర్శించారు. విద్యార్థినులు నృత్యాల ఆకట్టుకున్నాయి. కళారూపాలు ప్రదర్శించిన చిన్నారిని సత్కరించారు. కార్యక్రమంలో బొల్లిముంత కృష్ణ, బెల్లంకొండ వెంకట్, రంగిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్నంగి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ నిలిపివేత

కొల్లిపర, ఆగస్టు 22: మండల పరిధిలోని మున్నంగి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్‌ను నిలిపి వేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక సబ్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిడపర్రు, పిడపర్తిపాలెం, కొల్లిపర వ్యవసాయ మోటార్లకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌ను నిలిపి వేస్తున్నట్లు తెలియజేశారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు

● పోస్టల్ సూపరింటెండెంటు కరుణబాబు

తెనాలి, మారీసుపేట ఆగస్టు 22: తపాల బిళ్ళలను సేకరించే విద్యార్థులకు ఉపకార వేతనాలను అందిస్తామని తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంటు కరుణబాబు అన్నారు. పట్టణంలోని తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంటు కార్యాలయంలో గురువారం పోస్టల్ సూపరింటెండెంటు జి.కరుణబాబు ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ భారత తపాల శాఖ తపాల బిళ్ళల సేకరణను ప్రోత్సహించేందుకు దీన్ దయాల్ స్పర్శ యోజన అనే కొత్త పథకం ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ పథకం కింద తపాల బిళ్ళలను సేకరించే ఆసక్తి ఉన్న 6, 7, 8, 9 తరగతి చదివే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను అందజేస్తామని తెలిపారు. ఎంపిక ప్రక్రియ రెండు అంచెలుగా నిర్వహిస్తామని అవి రాత పరీక్ష, ప్రాజెక్టు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థి ఖచ్చితంగా 6-9వ తరగతి గుర్తింపుపొందిన పాఠశాలలో విద్యను అభ్యసించాలన్నారు. ఎన్నికైన విద్యార్థులకు ప్రతి నెల రూ.500 చొప్పున సంవత్సానికి రూ.6000 ఇస్తామన్నారు. స్కాలర్షిప్ నగదు విద్యార్థులు, తల్లిదండ్రుల పోస్ట్ ఆఫీస్ లేదా ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు సంయుక్త ఖాతాకు బదిలీ చేస్తామని తెలిపారు. విద్యార్థులు ఈ సదావకాశంను వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం దగ్గరలోని పోస్ట్ ఆఫీసులలో సంప్రదించాలని కోరారు.


పాల ఉత్పత్తిదారులకు బోనస్ అందజేస్తున్న వెంకటేశ్వరరావు

పాల ఉత్పత్తిదారులకు రూ.4.66 లక్షల బోనస్ పంపిణీ

తెనాలి అర్బన్, ఆగస్టు 22: రూరల్ మండలం పెదరావూరులో పాల ఉత్పత్తిదారులకు రూ.4.66 లక్షల బోనస్ పంపిణీ చేశారు. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో గురువారం జరిగిన కార్యక్రమంలో డెయిరీ పాలకవర్గ సభ్యుడు శాఖమూరి వెంకటేశ్వరరావు ఈ బోనస్‌ను అందజేశారు. 250మంది పాల ఉత్పత్తిదారులు ఉన్నారని, వారికి డెయిరీ తరపున పలు పథకాలు వర్తింపజేస్తున్నామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో బసవ శంకరరావు, వెంకటకృష్ణారావు, శ్రీనివాసరావు, కందేపి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మార్కెట్ వద్ద నాలుగురోడ్ల కూడలిలో నిలిచిపోయిన వాహనాలు

వాహనదారులకు ట్రాఫిక్ ఇక్కట్లు

ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు

తెనాలి రూరల్ ఆగస్టు 22: పట్టణంలో ట్రాఫిక్ జామ్ సమస్యతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్తక, వ్యాపార, వాణిజ్య రంగాల్లో పేరుగాంచిన తెనాలికి వివిధ పనుల నిమిత్తం పరిసర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఎక్కువగా మార్కెట్ ప్రధాన రోడ్డుపైగా దుకాణాలకు వచ్చేవారు ద్విచక్ర వాహనాలతో రాకపోకలు సాగిస్తుంటారు. ఉప్పుబజార్, గంగానమ్మపేటకు చేరుకునే కూడలి ప్రాంతంలో నాలుగు రోడ్ల నుంచి ఒక్కసారిగా వాహనదారులు రావడంతో ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుపోయారు. వాహనాలను క్రమ పద్ధతిలో పంపేందుకు ఉండాల్సిన పోలీసులు అక్కడ అందుబాటులో లేకపోవడంతో వాహనదారులు ఇష్టానుసారంగా వస్తూ ట్రాఫిక్ అంతరాయం కల్పిస్తున్నారు. గురువారం దాదాపుగా అదే ప్రాంతంలో అరగంటకు పైగా ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో వాహనదారులు అల్లాడిపోయారు. ఇప్పటికైనా ఈ ప్రాంతంలో పోలీసులు ప్రత్యేక దృష్టిపెట్టి వాహనాలు క్రమ పద్ధతిలో వెళ్లేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పెదకాకాని శివాలయంలో వధువు ఆత్మహత్యాయత్నం

పెదకాకాని, ఆగస్టు 22: తనకు ఇష్టం లేని వివాహాన్ని బలవంతంగా చేస్తున్నారని ఓ వధువు ఆత్మహత్యకు యత్నించిన సంఘటన పెదకాకాని శివాలయంలో జరిగింది. పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన యువకుడికి పొన్నూరు మండలంకు చెందిన యువతితో వివాహం జరిపించేందుకు పెద్దలు నిశ్చయించారు. దీంతో గురువారం వధూవరులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులందరూ పెదకాకాని శివాలయానికి చేరుకున్నారు. వధువును గదిలోకి తీసుకెళ్లగా ఆ సమయంలో తనకి పెళ్లి ఇష్టంలేదని తన చేతి గాజులతో చేతిపై గాయం చేసుకుంది మెడపైన గాయం చేసుకునేందుకు యత్నించగా గమనించిన బంధువులు అడ్డుకుని ఆసుపత్రికి తరలించారు. దీంతో ఇరువర్గాల పెద్దలు కూర్చొని మాట్లాడుకొని పెళ్లిని రద్దు చేసుకున్నారు.


వల్లభాపురంలో మొక్కలు నాటుతున్న అధికారులు, నాయకులు

పర్యావరణాన్ని పరిరక్షించండి: ఎంపీడీవో

కొల్లిపర, ఆగస్టు 22: చెట్లను పెంచడం వలన పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. గురువారం మండల పరిధిలోని వల్లభాపురంలో ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరుపక్కల అధికారులు, నాయకులతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని పెంచటం వలన ప్రజారోగ్యానికి మేలు జరుగుతుందన్నారు. వృక్షో రక్షిత రక్షితః అనే నినాదాన్ని ప్రజలు అమలు చేయాలన్నారు. వర్షాలు పడాలంటే చెట్లను తప్పని సరిగా పెంచాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అవుతు పోతిరెడ్డి, ఏపీవో రవి, కార్యదర్శి అలకానంద, నాయకులు వంగా సాంబిరెడ్డి, అవుతు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎరువులు,పురుగుమందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

పురుగు మందుల దుకాణాల్లో తనిఖీ

తెనాలి రూరల్, ఆగస్టు 22: ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో లీగల్ మెట్రాలజీ (తూనికలు, కొలతలశాఖ) అధికారులు గురువారం తనిఖీలు చేశారు. పట్టణంలోని ఎరువుల కొట్టబజారులోని పలు దుకాణాల్లో రికార్డులు పరిశీలించి బరువు, అమ్మకపు ధరలపై దుకాణ యజమానులను, వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు.

113 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, ఆగస్టు 22: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో గురువారం జరిగిన వేలంలో 113 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠధర రూ.10,800 గరిష్ఠధర రూ.12,800 మోడల్‌ధర రూ.12,200 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,100, గరిష్ఠధర రూ.12,900, మోడల్‌ధర రూ. 12,000లు పలికాయి.

మందుబాబులకు రూ.పది వేల జరినామా

మంగళగిరి, ఆగస్టు 22: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఇద్దరికి చెరో పదివేల రూపాయల జరిమానా, అదికట్టని పక్షంలో 15రోజుల జైలు శిక్ష విధిస్తూ మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్‌బాబు గురువారం తీర్పు చెప్పారు. ఈ నెల 18న కాజ టోల్ గేట్ వద్ద మంగళగిరి రూరల్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండగా బొల్లాపల్లికి చెందిన జి.కిషోర్, గుంటూరుకు చెందిన కె.సంపత్ కుమార్‌లు తమ ద్విచక్రవాహనాలపై మద్యం సేవించి వెళుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. తనిఖీల్లో పాల్గొన్న ట్రైనీ డీఎస్పీ భార్గవి, రూరల్ ఎస్ఐలు నిందితులపై కేసు నమోదు చేసి మంగళగిరి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఇద్దరికి చెరో పదివేల జరిమానా, అదికట్టని పక్షంలో 15రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ఆరో పటాలం కమాండెంట్‌గా నగేష్‌బాబు

మంగళగిరి సిటీ, ఆగస్టు 22: మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పోలీసు ఆరో పటాలం కమాండెంట్‌గా కే నగేష్‌బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆక్టోపస్‌లో అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై మంగళగిరి బెటాలియన్ కమాండెంట్‌గా వచ్చారు. మంగళగిరి బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేసిన వెలిశెల రత్న సుమారు రెండు నెలల కిందట బదిలీపై 14వ బెటాలియన్ కమాండెంట్‌గా వెళ్లారు. నూతన కమాండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన నగేష్‌బాబు ఆరో పటాలం అధికారులు, సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

స్థల వివాదంలో ఘర్షణ

తెనాలి రూరల్, ఆగస్టు 17: స్థల వివాదంలో ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో పరస్పరం అందిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని కంచెర్లపాలెం గ్రామానికి చెందిన కొత్తపలి రామారావు, అతడి బంధువు కొత్తపల్లి పుష్పరాజ్ మధ్య స్థలం విషయంలో వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో మాటమాట పెరిగి ఘర్షణకు దాసింది. దీంతో ఒకరిపై ఒకరు దాడిచేశారంటూ ఇద్దరూ కలిసి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరస్పర ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఖాజీపేట దుకాణంలో చోరీ

తెనాలి రూరల్, ఆగస్టు 22: మండలంలోని ఖాజీపేటలో పొట్లూరి సత్యనారాయణకు చెందిన కిరాణా దుకాణంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో చోరీజరిగిందని బాధితుడు తెలిపారు. షాపునకు వేసిన తాళాలు గుర్తుతెలియని వ్యక్తులు ధ్వసంచేసి కౌంటర్‌లోని రూ.6000, దుకాణంలోని సిగిరెట్లు, కూల్‌డ్రింక్స్ చోరీ చేశారన్నారు. దీనిపై గురువారం సాయంత్రం వరకూ ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్టు

పొన్నూరు టౌన్, ఆగస్టు 22: పొన్నూరు పట్టణంలో ఎన్జీవో కాలనీలో జూదం ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ పి.భాస్కర్ తెలిపారు. గురువారం పేకాట సమాచారం తెలుసుకున్న అర్బన్ సీఐ ఎన్జీవో కాలనీలో సోదాలు నిర్వహించారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.600 నగదు స్వాధీనం చేసుకున్నారు.

స్వయంకృషితో ఎదిగిన ఆదర్శవంతుడు చిరంజీవి

ఎమ్మెల్యే ధూళిపాళ్ళ

పొన్నూరు టౌన్, ఆగస్టు 22: స్వయంకృషితో అంచలంచెలుగా ఎదిగి ఉన్నతస్థానాలకు చేరుకున్న సినీనటుడు చిరంజీవి అందరికీ ఆదర్శవంతుడని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. డాక్టర్ పద్మవిభూషణ్ చిరంజీవి జన్మదిన వేడుకలు గురువారం పొన్నూరు పట్టణంలో ఘనంగా జరిగాయి. పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో శ్రీకృష్ణదేవరాయ, చిరంజీవి, రంగ, పవన్ సేవా సమితి, అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ప్రారంభించి రక్తదాతలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సినీనటుడిగా, రాజకీయవేత్తగా, సామాజిక సేవకుడిగా చిరంజీవి ఎదిగిన వైనాన్ని నరేంద్ర కుమార్ కొనియాడారు. శిబిరంలో 46 మంది రక్తదానం చేయగా సేకరించిన రక్తాన్ని తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి చిరంజీవి అభిమానులు అందచేశారు. అనంతరం కేక్‌ను కోసి పంచిపెట్టారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబు, మున్సిపల్ మాజీవైస్ చైర్మన్ ఆకుల సాంబశివరావు, యరసాని శ్రీరామమూర్తి, దాసరి రాము, కన్న రజిని, ఆమంచి సోములు, ఉగ్గిరాల సీతారామయ్య, బీజేపీ మహిళా అధ్యక్షురాలు కలపాల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● పొన్నూరు టౌన్: పట్టణంలో సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలను ఎన్జీరంగా విగ్రహం వద్ద గురువారం ది పొన్నూరు బ్లడ్ వెల్‌ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు రక్తదాన శిబిరం ప్రారంభించి రక్తదాతలకు ధ్రువీకరణ పత్రాలలు అందించి అభినందించారు. కార్యక్రమంలో బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమాశంకర్, జనసేన పట్టణ మండల అధ్యక్షుడు కరిముల్లా, సుబ్బారావు, టీడీపీ నాయకుడు ఆకుల సాంబశివరావు, తోట ప్రసాద్, పలు రాజకీయ పార్టీ నాయకులు స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.


రక్తదాతలకు ధ్రువీకరణ పత్రాలు అందచేస్తున్న జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు


శిబిరంలో రక్తదాతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్, తదితరులు

తెనాలిలో...

తెనాలి రూరల్, ఆగస్టు 22: చిరంజీవి జన్మదినం సందర్భంగా పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో కేక్‌ను కట్‌చేసి, పేదలకు అన్నదానం చేశారు. తొలుత తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో రక్తదాన శిబిరం నిర్వహించి గర్భిణులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. మంచాల రామకృష్ణ, జి.తులసి, దంతాల కిరణ్‌కుమార్, పొన్నం విజయ్‌కుమార్, వీరవల్లి మురళి, కన్నెగంటి మురళి, డీవీఎస్‌కే సాయి, నన్నపనేని రాంబాబు, కరేటి వీరయ్య, తిరుమలశెట్టి శ్రీనివాసరరావు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఎరుకలపూడిలో గ్రామసెంటర్‌లో భారీ కేక్‌ను కట్‌చేశారు.

● తెనాలి అర్బన్: చిరంజీవి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని వంగవీటి రాధారంగా కాపు యువజన సమితి ఆధ్వర్యంలో బిల్డర్‌గా ఎదిగిన కొండూరు శివయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాది పొన్నం విజయ్‌కుమార్, సెంట్రల్ బ్యాంకు మాజీ సీఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు, తన్నీరు శివశంకర్, దాది సూరయ్య, కఠారి హరీష్, గుంటూరు కోటేశ్వరరావు, కమ్మెల రజని, ఏడుకొండలు, రవికుమార్ పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: చిరంజీవి జన్మదినం సందర్భంగా బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మాగాంధీ వృద్ధాశ్రమంలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కాళి దాసు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అశోక్‌యాదవ్, పానకాలు, శ్రీను, రమణ, శరత్, యశ్వంత్, శివ పాల్గొన్నారు.

● పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఉద్యోగులు, విద్యార్థులు గురువారం చిరంజీవి జన్మదిన వేడుకలు నిర్వహించారు. విశ్వవిద్యాలయ ముఖద్వారం వద్ద భారీ కేక్ కట్‌చేసి, బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు విశ్వవిద్యాలయ జనసేన నాయకులు తోట వెంకటేష్, పుత్తూరు నాగరాజు, తోకల రామకృష్ణ, జనసేన, టీఎన్ఎస్ఎఫ్ స్టూడెంట్స్ పాల్గొన్నారు.

పొన్నూరు మున్సిపల్ కమిషనర్‌గా రమేష్‌బాబు

పొన్నూరు టౌన్, ఆగస్టు 22: పొన్నూరు మున్సిపల్ కమిషనర్‌గా ముప్పాళ్ల రమేష్‌బాబు నియమితులైయ్యారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ గురువారం మున్సిపల్ కమిషనర్ బదిలీ ఉత్తర్వులు జారీ చేసింది. పొన్నూరు కమిషనర్‌గా పనిచేస్తున్న సీఎంఏ నయీం అహ్మద్‌ను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ హెడ్‌క్వార్టర్‌లో రిపోర్ట్ చేయాల్సిందిగా అదేశించారు. పొన్నూరు కమిషనర్‌గా శ్రీకాళహస్తిలో పనిచేస్తున్న రమేష్‌బాబును నియమించారు.

నేడు ఉపాధి పనులపై గ్రామసభలు

పొన్నూరు టౌన్, ఆగస్టు 22: జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఈ నెల 23వ తేదీ ఉదయం 11గంటలకు పనుల గుర్తింపు మంజూరు నిమిత్తం అన్ని గ్రామాలలో గ్రామ సభలు నిర్వహిస్తునట్లు మండల పరిషత్ అధికారులు గురువారం తెలిపారు. ఈ గ్రామ సభల ద్వారా మంజూరైన పనులు, గుర్తించవలసిన పనులు, ప్రతిపాదన, సామాజిక తనిఖీల అవశ్యకత, కూలీలకు పనిదినాల కేటాయింపు వంటి అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. గ్రామ సభలకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. పొన్నూరు మండలంలోని 24 పంచాయతీలో ఈ గ్రామ సభలు జరగనునట్లు తెలిపారు.

హుండీల ద్వారా రూ.లక్ష ఆదాయం

పొన్నూరు టౌన్, ఆగస్టు 22: మండల పరిధిలోని కట్టెంపూడి నాగేంద్రస్వామి దేవస్థానం (పుట్ట) హుండీల లెక్కింపు ద్వారా రూ. 1,05,152 ఆదాయం సమకూరినట్లు ఆలయ మేనేజర్ ఎం.శ్రీనివాసరావు వెల్లడించారు. గురువారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.శ్యామల పర్యవేక్షణలో ఆలయ హుండీ తెరిచి లెక్కించారు. ఈ లెక్కింపులో దేవదాయ సిబ్బంది పాల్గొన్నారు.


టిడ్కో కాలనీ మహిళలతో మాట్లాడుతున్న అర్బన్ సీఐ

అసాంఘిక కార్యకలాపాలపై కఠినచర్యలు

అర్బన్ సీఐ భాస్కర్

పొన్నూరు టౌన్, ఆగస్టు 22: టిడ్కో గృహాల సమీపంలో జరిగే అసాంఘిక కార్యకలాపాలపై కఠినచర్యలు తీసుకుంటామని అర్బన్ సీఐ పి.భాస్కర్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని నిడుబ్రోలు టిడ్కో గృహాలను అర్బన్ పోలీసులు సందర్శించారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆదేశాలతో స్థానిక మహిళలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీ సమీపంలో మహిళలను ఇబ్బంది పెట్టిన, గంజాయి, మత్తుపదార్థాలు సేవించే వారిపై నిరంతరం నిఘా ఉంచనునట్లు చెప్పారు. మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన గృహ ఆవాసాల మధ్య ఎట్టువంటి అల్లర్లకు అభ్యంతర కార్యక్రమాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా పెట్రోలింగ్ వ్యవస్థను కొనసాగించి మహిళల భద్రతలకు చర్యలు తీసుకుంటామన్నారు. సమస్యలు ఉంటే 9440796172 నెంబరుకు సమాచారం అందించాలని మహిళలకు సూచించారు.



వీవీఐటీలో జరిగిన స్పర్థ 2కే24 సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు

వీవీఐటీలో 'స్పర్థ-2 కే 24' ప్రారంభం

పెదకాకాని, ఆగస్టు 22: వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో అసోసియేషన్ ఫర్ కంప్యూటింగ్ మిషనరీ (ఏసీఎం) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఆగస్టు 22, 23 తారీఖులలో రెండు రోజులపాటు నిర్వహించే స్పర్థ-2కే24 సాంకేతిక సదస్సును గురువారం ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 36 కళాశాలల నుంచి 210 గ్రూపులు, 4278 మంది విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొననున్నారు. రెండు రోజులపాటు నిర్వహించనునన్న ఈ కార్యక్రమములో అల్గో అరేనా, ట్రెజర్ ట్రూపర్, గేమ్ ఆఫ్ కోడ్, రిడిల్ ర్యాంపేజ్ వంటి అంశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నారు. ఈ సదస్సుకు హాజరైన విద్యార్థులకు అత్యాధునిక వర్చువల్ రియాలిటీ సాంకేతికతతో ఆటలు ఆడించారు. ఈ వేడులలో భాగంగా సాంకేతిక నైపుణ్యాల పెంపుదల, సామాజిక మాధ్యమాల వినియోగం వంటి అంశాలపై విద్యార్థులకు సదస్సులు నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సంస్థ సిర్కానా, ప్రొడక్ట్ డెవలప్మెంట్ టీమ్‌లీడ్ డాక్టర్ రాజేష్ బండికల్ల హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీఎం క్రానికల్ 2024 పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేష్ బండికల్ల మాట్లడుతూ విద్యార్థులు అధునాతన సాంకేతికతను ఎల్లప్పుడూ అందిపుచ్చుకోవాలని అన్నారు. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టు నూతన సాంకేతితను, నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

రైతుసేవా కేంద్రాల ద్వారా ఎరువులు అందించాలి

● ములకా శివసాంబిరెడ్డి

తెనాలి రూరల్, ఆగస్టు 22: రైతుసేవా (రైతు భరోసా) కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన డీఏపీ, ఇతర ఎరువులను అందించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పంట కాల్వల ద్వారా నీరందక ఇప్పటివరకూ ఇబ్బంది పడిన రైతులకు నీరు విడుదల చేయడంతో తడులు వేసుకుని ఎరువులు చిమ్ముకునేందుకు సిద్ధం అవుతున్న తరుణంలో రైతు సేవాకేంద్రాల్లో అవి అందుబాటులో లేవన్నారు. ఇది అదునుగా చూసుకొని ప్రైవేటు వ్యాపారులు బస్తాకు రూ.50లు అదనంగా వసూలు చేస్తున్నారని దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. తెనాలి పరిసర గ్రామాల రైతులు అధిక ధరలకు ఎరువులు కొనలేక బాపట్ల జిల్లా చుండూరు మండలం వలివేరు సొసైటీకి వెళ్లి తెచ్చుకుంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా రైతులకు వారి గ్రామాల్లోనే ఉన్న రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం ఎరువులు అందించేలా చర్యలు చేపట్టాలని శివసాంబిరెడ్డి కోరారు.

జూదరుల అరెస్టు: రూ.44170 నగదు స్వాధీనం

తెనాలి, మారీసుపేట, ఆగస్టు 22: స్థానిక బాలాజీరావు పేటలో పేకాట ఆడుతున్న జూదరులను అరెస్టు చేసినట్టు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం ప్రకారం స్థానిక బాలాజీ రావు పేటలో గురువారం శ్రీకృష్ణుడి గుడి వద్ద ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఆ ఇంటిపై దాడులు నిర్వహించామన్నారు. అక్కడ పేకాట ఆడుతున్న తొమ్మిదిమందిని అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ.44,170 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.